
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025



5

ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ

- రేషన్ షాపుల వద్ద కొలిక్కిరాని ప్రక్రియ
- మూడు జిల్లాల్లో 5 లక్షల పైచిలుకు పెండింగ్
- నెలాఖరు వరకూ గడువు పొడిగింపు..
- ఆ లోగా పూర్తి కాకుంటే రేషన్ కట్..
- ఈ నెల కూడా కనిపించని కందిపప్పు



8

ఉపాధితో.. వలసలకు.. కళ్లెం

- వేసవి వలసల నివారణకు చర్యలు
- మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు
- రోజు కూలి రూ. 300గా ప్రకటన
- ఐదు రకాల పనులకు ప్రాధాన్యం

వేసవిలో వలసల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల వారీగా ఉపాధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేశారు. మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. గత ఏడాది చేసిన పని దినాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది పని దినాలను రూపొందించారు. ఏడాది మొత్తంలో నెలల వారీగా ఏ నెలలో ఎన్ని పని దినాలు కల్పించాలన్న నివేదికను సిద్ధం చేశారు. పని దినాలను లక్ష్యాల మేర పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పల్లెల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నారు.



నరసరావుపేట : ఉపాధి పనుల్లో కూలీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం పల్లెలకు ప్రగతి బాటలు వేస్తోంది. పథకంలో పేరు నమోదు చేసుకున్న ప్రతి కూలీకి వంద రోజులు పనిదినాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పంచాయతీల వారీగా పనులను గుర్తించారు. ప్రతి కూలీకి కనీస వేతనం రూ. 300గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతోంది. నీటి సంరక్షణ, నీటి నిల్వలో భాగంగా వాగులు వంకలు, కుంటలు చెరువులు, చెక్ డ్యామ్‌ల్లో పూడికతీత పనులతో పాటు ఊట కుంటలు, పంట నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, రహదారుల నిర్మాణం, రైతుల పొలాల్లో ఉద్యాన పండ్లతోటల సాగు, మొక్కల నాటడం వంటి పనులు చేపట్టనున్నారు.

జిల్లా	పని దినాలు
పల్నాడు	74,77,946
గుంటూరు	34,20,809
బాపట్ల	76,56,945

పల్నాడు జిల్లాలో జాబ్ కార్డుల 3.4 లక్షలు జారీ చేశారు. 5.84 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 2.51 లక్షలు కాగా 4.27లక్షల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. బాపట్ల జిల్లాలో 2.69 లక్షల జాబ్ కార్డులు జారీ చేశారు. 4.75 లక్షల మంది కూలీలను నమో దు చేశారు. 2.05లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. 3.58 లక్షల మంది కూలీలు పనులకు హాజరవు తున్నారు. గుంటూరు జిల్లాలో 1.26 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. 2.10 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 91,815 ఉన్నాయి. 1,44,399 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

డ్వామా శాఖ ఇందుకు సంబంధించిన ప్రణాళికను విడుదల చేసిం ది. రానున్న మూడు నెలల్లో చేపట్టే పనుల జాబితాను రూపొందించింది. ఐదు రకాల పనులకు ప్రాధాన్యం కల్పించారు. పనులు వివరాలు ఇలా ఉన్నాయి. పశువులు గుంపుగా చేరుటకు అనువుగా ఉన్న ప్రదేశమలో నీటి తొట్లలను నిర్మిస్తారు. ఈ పనులను 1న ప్రారంభించారు. ఈ నెల 10 కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

పల్నాడు జిల్లాలో 14,000 సేద్యపు నీటి కుంటలను నిర్మించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. గుంటూరు జిల్లాలో 8,500, బాపట్ల జిల్లాలో 9,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యంగా నిర్ణయించారు. లక్ష్యం మేరకు పూర్తి చేయడం. త్వరితగతిన ఇన్లెట్, అవుట్ లెట్, సిల్ట్ ట్రాప్ పనులను పూర్తి చేయనున్నారు.

పంట కాలువ.. ఫీడర్.. సప్లై ఛానల్ పనులు అవసరాన్ని బట్టి పనులు చేయనున్నారు. 3 సంవత్సరాల కాల వ్యవధి పాటించడం. కూలీలకు పూర్తి దినసరి వేతనం రూ. 300 తగినట్లు మార్కింగ్ ఇచ్చి పని చేయించడం. వర్షాకాలం వచ్చే లోపు పంటకాలువ పనులను పూర్తిచేయను న్నారు. విస్తృత స్థాయిలో కూలీలకు పని కల్పించడం. చెరువు.. కుంటలను వాటి అసలు సామర్థ్యం వుండే విధంగా పునరుద్ధరించడం. మట్టి గుంతలను చెరువు కట్ట అడుగు నుండి కట్టఎత్తు కంటే పది రెట్ల దూరం తరువాత తవ్వడం. గ్రూపులు.. కూలీల సంఖ్య ఆధారంగా పూడిక గుంతల కొలతలు కేటాయిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన దినసరి వేతన రేటు రూ. 300 ప్రతి ఒక్కరు పొందే విధంగా ఆయా పనులకు సంబంధించిన ఖచ్చితమైన పని కల్పించే విధంగా మేట్లు శ్రద్ధ వహించాలి. ప్రతి శుక్రవారం రోజ్ గార్ దివస్ సందర్భంగా కూలీలకు ఆయా పనులకు సంబంధించిన దినసరి వేతనంపై ఎప్పటికప్పుడు ఖచ్చితమైనఅవగాహన కల్పిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న వేగేశన

ఐదేళ్ల చిన్నారిని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేగు బంధాన్ని తెంచుకుని తల్లి వదిలేసి వెళ్లిపోగా.. ఐదేళ్ల చిన్నారిని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేరదీసి మానవత్వం చాటుకున్నారు. ఆ చిన్నారి బాధ్యత తనదని దత్తతు తీసు కుంటానని చెప్పడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని 1వవార్డు బేతనీకాలనీలో బుధవారం మనవార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని వేగేశన నిర్వహించారు. ఆ ప్రాంతంలో పర్యటించే సమయంలో ఆదరించేవారు లేక, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అందక చిన్నభిన్నమైన కుటుంబంలోని ఐదేళ్ళ చిన్నారి పరిస్థితి గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఇద్దరు పిల్లల్ని తల్లి సత్తెనపల్లిలో వదిలేసి వెళ్లి పోగా విషయం తెలుసుకున్న నాయనమ్మ వారిని చేరదీసింది. ఈ విషయం ఎమ్మెల్యేకు తెలిపి తన ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్ళింది. దీంతో స్పందించిన వేగేశన ఐదేళ్ల చిన్నారి మేఘశ్రీని దత్తతు తీసుకుంటానని అక్కడికక్కడే ప్రకటించారు. ఇక నుంచి ఆ బిడ్డకు అన్నీ తానై చూస్తానని, దత్తతు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీంతో ఆప్రాంత ప్రజలు ఎమ్మెల్యే ఉదారతపై ప్రశంసల వర్షం కురిపించారు.




దత్తత తీసుకున్న పాపతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం



- 22 వరకు సీనియర్ ఇంటర్ తరగతులు
- 25 వరకు కళాశాల వసతిగృహాల నిర్వహణ
- విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇంటర్ మీడియట్ విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. పరీక్షల అనంతరం నుంచి విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో సీనియర్ ఇంటర్ తరగతులను గురువారం నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీనియర్ ఇంటర్ తరగతులు పునః ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 22 వ తేదీ వరకు సీనియర్ ఇంటర్ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసి ద్వితీయ సంవత్సరంలోకి రానున్న విద్యార్థులు తప్పని సరిగా కళాశాలలకు రావాలని ఇప్పటికే ప్రిన్సిపల్స్ నుంచి సందేశాలు అందాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 65 వేల మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. మార్చిలో జరిగిన పరీక్షలు పూర్తి చేసుకుని ఇప్పటికే విద్యార్థులు సెలవుల్లో ఉన్నారు. తాజాగా తరగతుల ప్రారంభానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారంతా తిరిగి కళాశాలలకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ద్వితీయ సంవత్సరంలో కనీసం రెండు మూడు యూనిట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విద్యార్థులను కళాశాలకు రప్పించేందుకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కళా శాలల హాస్టళ్లలో ఈ నెల 25 వరకు ఇంటర్ విద్యార్థులకు వసతి కల్పిస్తారని ప్రిన్సిపల్స్ చెబుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రికార్డులు పంపిణీ చేసేందుకు అధ్యా పకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



70 కాదు.. 140 మీటర్లు

దేశంలోనే అతిపెద్దగా అమరావతి ఓఆర్ఆర్

దేశంలోనే అతిపెద్దదిగా.. రాజధాని నగర అభివృద్ధిలో కీలక ప్రాజెక్టుగా.. అద్భుతంగా.. సబర్బన్ రైళ్ల మార్గంతో.. పది వరుసల్లో.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డుతో.. ఔటర్ రింగురోడ్డు 140 మీటర్ల వెడల్పుతో అమరావతికి ఓ మణిహారంగా నిర్మాణం కానున్నది. గతంలో 70 మీటర్లకు పరిమితం చేసిన కేంద్రం తాజాగా దానిని 140 మీటర్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది. రాజధానికి మెరుగైన కనెక్టివిటీ, రహదారి వెంబడి వచ్చే కారిడార్ల ఏర్పాటుతో జరిగే ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధితో అమరావతి నగర విస్తరణను తనదాకా నడిపించడంలో ఈ ఓఆర్ఆర్ పెద్ద ఆకర్షణశక్తిగా పనిచేయనున్నది. భవిష్యత్‌లో అమరావతి నగర ప్రజల జీవన ప్రమాణాల తాలూకు నాణ్యతను బాగా మెరుగుపరచడంలో కూడా ఈ ఓఆర్ఆర్ కీలకపాత్ర పోషించనుంది.

- ఫలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషి
- 189.4 కిమీల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- మూడు దశల్లో.. మూడేళ్లలోపు పూర్తిచేసేలా కాలపరిమితి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అమరావతి చుట్టూ ఔటర్‌రింగురోడ్డును దేశంలో కెల్లా అతిపెద్దదిగా నిర్మించాలనుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు అనుకున్న ప్రకారమే కార్యరూపం దాల్చుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డును 189.4 కి.మీ.ల పొడవునా 150 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయాలన్న చంద్రబాబు పట్టుదల ముందు కేంద్రం తలొగ్గింది. గత ఫిబ్రవరిలో ఓఆర్ఆర్ వెడల్పును 70మీటర్లకు పరిమితం చేస్తూ కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆరు వరుసల రహదారిగా నిర్మించాలని, లోపలి వైపున మాత్రమే సర్వీసు రోడ్డును నిర్మిస్తే సరిపోతుందని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణను 70 మీటర్లకు పరిమితం చేయొచ్చని గత నెలలో నిర్ణయించి రూ.16,310 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేసింది. అయితే ఇది ఎంతమాత్రం కుదరదని వెడల్పు ఆది నుంచి అనుకుంటున్న విధంగా 150 మీటర్ల ఉండాల్సిందేనంటూ సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి స్పష్టం చేస్తూ ఇటీవల లేఖ రాశారు. దీంతో 140 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్ఆర్ పేరిట 189.4 కి.మీ.లకు భూసేకరణకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై ఏర్పడిన ప్రతిష్ఠంభన చిట్టచివరికి తొలగిపోవడంతో త్వరలోనే టెండర్లను కేంద్రం ఆహ్వానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓ వైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకుంటున్న నేపథ్యంలో వాటికి సమాంతరంగా ఔటర్ రింగు రోడ్డు పనులను కూడా ప్రారంభించాలని చంద్రబాబు పట్టుదలగా ఉన్నారు. రాజధాని నిర్మాణ పనులను వచ్చే మూడేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఓఆర్ఆర్‌ను కూడా మూడు దశల్లో మొత్తం మూడేళ్లలోపుగా పూర్తి చేసేలా కాలపరిమితి సీఎం చంద్రబాబు నిర్దేశించుకున్నారు. నిజానికి గత నెలలో ఓఆర్ఆర్ తాలూకు భూసేకరణ విషయంలో పడిన పీటముడి వీడడానికి మరింత సమయం పట్టవచ్చునన్న ఊహాగానాలను పటాపంచలు చేస్తూ యుద్ధప్రాతిపదికన 140 మీటర్ల వెడల్పున భూసేకరణ చేసేలా కేంద్రాన్ని రాష్ట్రప్రభుత్వం ఒప్పించగలిగింది.

రూ.20 వేల కోట్లకు పెరగనున్న అంచనా వ్యయం

అమరావతి ఓఆర్ఆర్ ప్రాజెక్టు వ్యయం పెరగనుంది. గతంలో ప్రకటించిన విధంగా రూ.16310 కోట్లకు బదులు మరికొంత పెరిగే అవకాశం కనిపిస్తుంది. గతంలో సివిల్ వర్కుల అంచనా వ్యయాన్ని రూ.12,955 కోట్లుగా నిర్ణయించగా తాజాగా ఓఆర్ఆర్‌కు వెలుపలి వైపు కూడా సర్వీసు రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించడంతో వ్యయం మరో రూ.500 కోట్లకుపైగా పెరిగే అవకాశం ఉంది. అలాగే భూసేకరణ వ్యయం దాదాపు రెట్టింపవనున్నది. 70 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ నిర్మాణం చేయాలనుకున్నపుడు 4,220 ఎకరాలు సరిపోతుందని భావించి వ్యయం రూ.2,665 కోట్లుగా (మిగతా 6వ పేజీలో)

చక్రం తిప్పిన చంద్రబాబు



అమరావతి ఓఆర్ఆర్ 70 మీటర్లు.. ఆరు వరుసలతో సరిపోతుందని కేంద్రం గత నెలలో నిర్ణయించింది. అయితే భవిష్యత్తులో పది వరసలకు పెంచాల్సి వస్తుందని.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగితేనే ఔటర్‌కు బాహ్యంగా ఉన్నప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని.. ఓఆర్ఆర్ వెంటే సబర్బన్ రైల్వేలైను నిర్మించాలన్న ప్రతిపాదనలు తమ వద్ద ఉన్నాయని సీఎం చంద్రబాబు కేంద్రానికి వివరించారు. ప్రధానంగా పదిలేన్లుగా విస్తరించాల్సి వచ్చినపుడు కొత్తగా భూసేకరణ అంటే ఖర్చు విపరీతంగా పెరుగుతుందని చెప్పారు. దీంతో చంద్రబాబు కోరినట్లు 150 మీటర్లు కాకుండా 140 మీటర్ల వెడల్పుకు ఆమోదం తెలిపింది. మొత్తమ్మీద చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఓఆర్ఆర్ నిర్మాణం జరగనున్నది.

లాటరీ దందాపై నిఘా ఏదీ?





జిల్లాలో యథేచ్ఛగా సింగిల్ నంబర్ లాటరీ

- రోజువారీ కూలీలే ఏజెంట్ల టార్గెట్
- బాపట్ల, చీరాల, రేపల్లెలో విస్తృతం

ఫలానా లాటరీ టిక్కెట్ కొంటే అదృష్టదేవత మీ ఇంటి తలుపు తడుతుంది. టిక్కెట్ ధర కూడా వంద రూపాయలే. రాత్రికి రాత్రే కోటీశ్వరులు అయిపోవచ్చు" ఇలాంటి ఆకర్షణీయ ప్రకటనలతో ఏజెంట్లు విసిరే వలలో వేతన జీవులు పడుతున్నారు. రోజువారీ కూలీ పనులకు వెళ్లేవారు, ఆటో డ్రైవర్లే టార్గెట్‌గా ఈ లాటరీ దందా జిల్లాలో వేళ్లూనుకుంటోంది. సిక్కిం, నాగాలాండ్, కేరళ ఇలా ఇలా రకరకాల ప్రాంతాల పేరుతో టిక్కెట్లను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. 2021 నుంచి 2024 వరకు ఈ లాటరీ టిక్కెట్ల వ్యవహారంపై జిల్లాలో 16 కేసులు నమోదవగా అన్నీ చీరాల పరిధిలోనివే కావడం గమనార్హం. వ్యవస్థలకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెప్పి తమ దందాను కొనసాగిస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లాలో సింగిల్ నెంబర్ లాటరీ, మట్కా జూదం జోరుగా సాగుతోంది. పలు రాష్ట్రాల పేర్లతో ఈ లాటరీ టిక్కెట్ల అమ్మకం జరుగుతూ ఉంటుంది. టిక్కెట్ ధర వంద రూపాయలనుంచి వెయ్యి రూపాయల వరకు ఉండడం, వీటి మీద తగిలే మొత్తాలను మాత్రం లక్షల నుంచి కోట్ల వరకు ఏజెంట్లు ఆశ చూపడంతో దినసరి కూలీలు వీరి మాటలను తేలికగా నమ్మి కష్టపడ్డ సొమ్మును ఏజెంట్లకు సమర్పించుకుంటున్నారు. బాపట్లలో రథంబజార్‌లో ఉదయం పూట రోజువారీ పనుల కోసం పెద్దఎత్తున కార్మికులు ఉంటారు. అదే విధంగా చీరాల, రేపల్లెలో సైతం పనుల కోసం గుంపులు గుంపులుగా కూలీలు నిలబడి ఉంటారు. వీరిలో ఒకరిలా కలిసిపోయే ఏజెంట్లు వారిని మాయమాట లలో లోబర్చుకుని టిక్కెట్లు వారికి అంటగడు తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే వాట్సాప్ ద్వారా కూడా టిక్కెట్లు పంపే విధానానికి ఇటీవల ఏజెంట్లు శ్రీకారం చుట్టినట్లు చెబుతున్నారు. ఈ తరహా దందా లకు బడ్డీకొట్లు, టీ హోటళ్లు కూడా వేదికగా మారి నట్లు తెలుస్తోంది. ఒక వేళ కలిసొచ్చి నంబర్‌కు లా టరీ తగిలినా ఏజెంట్లు ముఖం చాటేయడంతో తా ము మోసపోయామని ఆలస్యంగా తెలుసుకుంటున్నారు.

కట్టడి విషయంలో నిర్లక్ష్యమే...

ఇలాంటి దందాలు ఎక్కడా కూడా బహిర్గతంగా జరగవు. అన్ని గుట్టుమట్టుగానే జరుగుతుంటాయి. కట్టడి చేయాలన్నా, దందా మూలాలు వెలుగు చూడాలన్నా కూడా నిఘా వర్గాలే కీలకం. కానీ ఆ దిశగా శోధిస్తున్న దాఖలాలు కనబడడం లేదు. ఏజెంట్లు ద్వారా మోసపోయిన వారు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే భయపడుతున్నారు. దీనికి కారణం ఒక్కటే అసలు లాటరీ టిక్కెట్లు కొనడమే అనధికారికం కనుక ఎవరికి వారు మిన్నకుండిపోతున్నారు. ఒకట్రెండు ఘటనల్లో బాధితులు స్టేషన్ మెట్లెక్కినా ఏజెంట్లు ముడుపుల మాయాజాలంతో వ్యవస్థలను కూడా మేనేజ్ చేస్తున్నట్లు సమాచారం

గంటగంటకూ ఫలితాలంటూ ఎర...

ఆయా రాష్ట్రాల పేరుతో సింగిల్ నంబర్ లాటరీ టిక్కెట్లు అమ్మడం ఓ రకం దందా అయితే ఊరు పేరులేకుండా కేవలం చీటీల మీద నంబర్లు వేసి ఇచ్చి వేతన జీవులను నిలువునా మోసం చేస్తున్నారు. ఉదయం 12 గంటల వరకు వీటి అమ్మకాలు తర్వాత గంటగంటకు లాటరీ తీశామంటూ ఏజెంట్లు నంబర్లు ప్రకటిస్తూ ఉంటారు. ఈ దందా మొత్తం కేరళ నుంచి ఆపరేట్ అవుతుందని బాధితులను ఏజెంట్లు నమ్మించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు.

ఈపూరుపాలెం నుంచి వేటపాలెం వరకు...

చీరాల నియోజకవర్గంలో సింగిల్ నెంబర్ లాటరీ యధేశ్ఛగా సాగుతోంది. ఈపూరుపాలెం మొదలుకుని జాండ్రపేట, దేవాంగపురి. వేటపాలెం వరకు నిత్యం లాటరీ హద్దులు దాటుతుంది. అమాయకులే లక్ష్యం గా ఈ దందా పెద్ద ఎత్తున నడుస్తుండగా వేటపాలెం, జాండ్రపేటకు చెందిన వ్యక్తులు ఈ రాకెట్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ దందా ఆఫ్ లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్ వేదికలపై ఉదయం 7కు మొదలుకుని ప్రతి మూడు గంటలకు బుకీ లు ఆన్‌లైన్ యాప్ ద్వారా ఓ సెన్సెక్స్ కూడా విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. వారి వద్ద రూ.10 తో కొను గోలు చేసిన స్లిప్పులను సెన్సెక్స్ ద్వారా విడుదల చేసిన సమ యంలో ఒక నెంబర్ విడుదలవుతుంది. విడుదలయిన నెంబర్‌ను వారి వద్ద ఉన్న నెంబర్‌కు మ్యాచ్ చేసుకుంటూ ఉంటారు. అయితే చివరి వరకు నెంబర్‌లు విడుదల యినా తరువాత పూర్తి నెంబర్‌లు మ్యాచ్ అయిన వ్యక్తికి పదింతల నగదును చెల్లిస్తామని ఆశచూపెడుతు న్నారు. ఈక్రమంలో అమాయకుల ఆశ లను ఆసరాగా చేసుకుని ఏజెంట్లు డబ్బులు దండుకుంటున్నారు. అయితే గతంలో ఈపూరుపాలెం, వేటపాలెం, చీరాల వన్‌టౌన్‌లో కేసులు నమోదైనాయి. కానీ ఇటీవల పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానా లకు తావిస్తోంది.

ఆరు పళ్ళ విభాగంలో కోదాడ ఎడ్లకు ప్రథమ స్థానం

బెల్లంకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందిపాడు గ్రామంలో వెంకటేశ్వర స్వామి తిరునాళ్ళ సందర్భంగా నిర్వహించిన ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల పశు బల ప్రదర్శనలో ఆరు పళ్ళ విభాగంలో తెలంగాణా రాష్ట్ర సూర్యాపేట మండలం కోదాడ గ్రామానికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి ఎడ్ల జత 4400 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం సాధించింది. నకిరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 4000 అడుగుల దూరం లాగి రెండోస్థానం, ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 3,389 అడుగుల దూరం లాగి మూడో స్థానం, తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట మండలం కోదాడ గ్రామానికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఎడ్ల జత 3,286 అడుగులు లాగి నాల్గో స్థానం, అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చావం హేమత్ సాయి రామ్‌కు చెందిన ఎడ్ల జత 3,219.7 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన జీ లక్ష్మీ వివేక్‌కు చెందిన ఎడ్ల జత 3,131.7 అడుగుల దూరం లాగి ఆరో స్థానం సాధించాయి. ఆరు పళ్ళ విభాగంలో మొత్తం పది ఎడ్ల జతలు ప్రదర్శనలో పాల్గొన్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బండి పల్లెకొండ, శ్రీహరిరావు, వెంకట నరసయ్య, గ్రామస్తులు పర్యవేక్షించారు.

నేడు రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతుంది. గురువారం విజయవాడ లెనిన్ సెంటర్ నందు గల సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో 15 గ్రామాలకు చెందిన రైతులకు ప్లాట్లు కేటాయించనున్నారు. 194 మంది రైతులకు 502 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ-లాటరీ జరగనుందని సీఆర్డీఏ కార్యాలయం వర్గాలు బుధవారం తెలిపాయి. నవులూరు 1, 2 యూనిట్‌లకు, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక, నెక్కల్లు, అనంతవరం గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ- లాటరీకి హాజరుకావాలని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాయపూడి 1, 2. వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, దొండపాడు, పిచుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం,ఉద్దండ్రాయునిపాలెం గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ-లాటరీకి హాజరుకావాలని అధికారులు కోరారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు పునఃప్రారంభం

మంగళగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అతిప్రధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు పునఃప్రారంభమయ్యాయి. రాజధాని అమరావతిలో సీడ్‌యాక్సెస్ రోడ్డును దొండపాడు నుంచి మణిపాల్ ఆస్పత్రి వద్ద కనకదుర్గా వారధి వరకు జాతీయ రహదారి-16ను అనుసంధానించేలా ఈ-3 రోడ్డు పేరిట ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణ పనులను రెండు దశలుగా చేపట్టారు. దొండపాడు నుంచి ఉండవల్లి వరకు ఒకదశగాను, ఉండవల్లి నుంచి కనకదుర్గావారధి వరకు రెండో దశగాను నిర్మించాలని ప్రతిపాదించి 2017-18 పీరియడ్‌లో వెంకటపాలెం వరకు దీనిని నిర్మించారు. అయితే తొలిదశ పనుల్లో అటూఇటూ కొంతమేర పనులు జరుగలేదు. ఈ తొలిదశ పనులకు సంబంధించి రాయపూడి జంక్షన్ నుంచి ఓ అరకిలోమీటరు దూరం వరకు దొండపాడు వైపు మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులను మంగళవారం నుంచి పునఃప్రారంభించారు. దీంతో పాటు రెండోదశ తాలూకు పనులను కూడా ఆరంభిస్తారని తెలుస్తోంది. ఈ మొత్తం పనులను ఎన్‌సీసీ కంపెనీ రూ.188 కోట్లకు దక్కించుకున్నట్టు తెలిసింది.



రాయపూడి వద్ద పునఃప్రారంభమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు

రైల్వే ప్రాజెక్టులపై అనిశ్చితి

- కేటాయింపులపై ఇప్పటికీ అస్పష్టతే
- పనులు ఎలా ముందుకెళ్లాలో తెలియని వైనం
- గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు, మూడు రోజుల్లోనే పింక్‌బుక్
- 2 నెలలు గడుస్తున్నా విడుదల చేయని రైల్వేబోర్డు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 2025-26 నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో గుంటూరు డివిజన్ రైల్వే ప్రాజెక్టులకు జరిగిన కేటాయింపులపై స్పష్టత కొరవడింది. కీలకమైన అమరావతి నూతన రైలుమార్గం, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులకు ఏ మేరకు నిధులు కేటాయించరనేది తెలియకుండా ఉన్నది. రైల్వే అధికారులకు అంతర్గతంగానూ ఆ వివరాలను నేటివరకు రైల్వేబోర్డు పంపించలేదు. గతంలో పబ్లిక్ డొమైన్‌లో అన్ని వివరాలను ఉంచే రైల్వే బోర్డు ఈ ఏడాది ఎందుకు అంత గోప్యత పాటిస్తుందో ఎవరికి అంతు చిక్కకుండా ఉన్నది. దీనిపై ఇప్పటికే జెడ్‌ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీల సభ్యులు రైల్వేబోర్డుకు లేఖలు పంపారు.

కేంద్ర బడ్జెట్‌ని ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీనే ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టారు. గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు, మూడు రోజుల వ్యవధిలో రైల్వేకి సంబంధించి అన్ని ప్రాజెక్టులు, వర్కులకు కేటాయించిన నిధుల వివరాలతో పింక్‌బుక్ విడుదలయ్యేది. ఇది ఇండియన్‌రైల్వేస్ వెబ్ పోర్టల్‌లో అందరికి అందుబాటులో ఉంచేవారు. దాంతో డివిజన్‌కి ఎంత మొత్తంలో నిధులు విడుదలయ్యాయనేది తెలిసిపోయేది. దాంతో ఆయా ప్రాజెక్టులు ఎప్పటిలోపు పూర్తి అవుతాయనే విషయంపై ఒక అంచనాకు వచ్చేవాళ్లు. గత ఏడాది నెల ఆలస్యమైనా పింక్‌బుక్‌ని రైల్వే శాఖ విడుదల చేసింది. ఈ సంవత్సరం ఏ కారణంతోనో రెండు నెలలైనా ఆ ఊసే లేకుండా పోయింది.

- గుంటూరు డివిజన్‌కి సంబంధించి నడికుడి - శ్రీకాళహస్తి(309 కిలోమటర్ల) రైలు మార్గం పనులను రైల్వే శాఖ రూ. 2650 కోట్లతో చేపట్టింది. ఇందులో దాదాపుగా రూ. 1300 కోట్ల విలువ చేసే పనులు పూర్తి అయ్యాయి. గత ఏడాది రూ. 450 కోట్లు మంజూరయ్యాయి. ఇవి ఏమేరకు ఖర్చు చేశారనేది 2024-25 రివైజ్డ్ అవుట్‌లేలో చూపిస్తారు. అలానే 2025-26కి ఎంత కేటాయింపులు చేశారనేది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అవుట్‌లేలో చూపిస్తారు. అలాంటిది ఆ వివరాలు ఏవీ తెలియని పరిస్థితి నెలకొన్నది.
- విజయవాడ - గుంటూరు వయా అమరావతి(106) కిలోమీటర్ల నూతన రైలు మార్గం పనులను రూ. 2679.59 కోట్లతో రైల్వే శాఖ మంజూరు చేసింది. వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టుకి రూపాయి కూడా కేటాయింపు జరగలేదు. గత ఏడాది కేంద్రంలో ఎన్‌డీటీ కూటమి ఏర్పడటం, అందులో టీడీపీ, జనసేన భాగాస్వామ్యం కావడంతో దీనిని ముందుకు తీసుకెళ్లేందుకు రూ. 50 కోట్లు కేటాయించింది. దాంతో భూసేకరణ ప్రక్రియని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఏడాది ప్రాజెక్టుని గ్రౌండింగ్ చేసేందుకు ఎంత మేరకు నిధులు ఇచ్చారో తెలియకుండా ఉన్నది.
- గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్(401.47 కిలోమీటర్లు)కు గత ఏడాది రూ. 480 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 3269 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 2,918 కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రాజెక్టు చివరి దశకు చేరుకొన్న నేపథ్యంలో నిధులు విడుదల ఎంతో అవసరం. ఆ వివరాలు నేటివరకు డివిజన్‌కి కూడా అందని పరిస్థితి.
- గుంటూరు-బీబీనగర్ డబ్లింగ్‌కి రూ.2,853.23 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. గతేడాది రూ. 220 కోట్లు మంజూరయ్యాయి. దాంతో పలు సెక్షన్లలో పనులు ప్రారంభమయ్యాయి. వాటిని వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు నిధులు ఎక్కువ మొత్తంలో అవసరం. ఈ ఏడాది ఎంత కేటాయించారో తెలియడం లేదు.
- రైలు మార్గాలే కాకుండా డివిజన్‌లో లెవల్ క్రాసింగ్ గేట్లు తొలగించేందుకు పలు సెక్షన్లలో ఆర్‌వోబీ/ఆర్‌యూబీలను రైల్వే శాఖ గతంలోనే మంజూరు చేసింది. వాటి పనులు మొదలు కావాలంటే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తప్పనిసరి. ఈ సంవత్సరం ఎన్ని ఆర్‌వోబీ/ఆర్‌యూబీలు పూర్తి చేసేందుకు నిధులు విడుదల జరిగిందో స్పష్టత లేకుండా ఉన్నది.

రాజసానికి పెట్టింది పేరు ఒంగోలు జాతి ఎద్దులు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి ఎద్దులంటేనే రాజసానికి, పౌరుషానికి పెట్టింది పేరని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన, పశుపాల పోటీలకు ఐదో రోజు బుధవారం మంత్రి సవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ తెనాలిలో జాతీయ స్థాయి ఎడ్లబల ప్రదర్శనతో పండుగ వాతావరణం సంతరించుకుందన్నారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కాఆనంద బాబు, కమిటీ సభ్యుల సహకారంతో ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల భావితరాల్లో ఒంగోలు జాతి ఎడ్లపై మమకారం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల కోసం కొత్త స్కీం తీసుకురాబోతున్నారని, పాడి రైతులను ప్రోత్సహించేలా డైరీ ఫామ్స్ పెట్టుకునేలా 50శాతం సబ్సిడీతో లోన్లు ఇచ్చి అంతరించిపోతున్న పాడి పరిశ్రమను తిరిగి నిలబెట్టుకునేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు కుమారుడు గద్దె క్రాంతికిరణ్, స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై దివంగత ఎన్టీఆర్, ఆలపాటి శివరామకృష్ణయ్యల విగ్రహాలకు ముందుగా నివాళులర్పించి కార్యక్రమాలను ప్రారంభించారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, పుల్లారావు

సేద్యం విభాగంలో పెదగొట్టిపాడు ఎడ్లజత ప్రథమం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి వెంకట్రామయ్య స్మారక ఎడ్ల బల ప్రదర్శనలో పెదగొట్టిపాడు ఎడ్లు ప్రథమ స్థానం సాధించాయి. తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఎడ్ల ప్రదర్శనలో బుధవారం గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 5100 అడుగులు దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా ఉయ్యందన గ్రామానికి చెందిన రైతు వీరబ్రహ్మనాయుడు ఎడ్ల జత 4854 అడుగులు దూరం లాగి ద్వితీయ స్థానం, వేటపాలెంకు చెందిన రైతులు శివకృష్ణ చౌదరి, శిరీష చౌదరీల ఎడ్లజత 4807అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. 4,5,6,7,8,9 స్థానాల్లో వరుసగా కొప్పురావూరు రైతు తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 4734 అడుగుల దూరం, సరిపూడి రైతు పవన్‌కుమార్ చౌదరి ఎడ్ల జత 4449అడుగులు, సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్ రైతు సహ్రస యాదవ్ ఎడ్లజత 4395 అడుగులు, పెదగొట్టిపాడు రైతు లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4202 అడుగులు, మాచవరం రైతు యామినిమోహన ఎడ్లజత 3935అడుగులు, కృష్ణా జిల్లా చినపులిపాక రైతు ఎడ్లజత 3600అడుగులు లాగాయి. విజేతలకు 1వ స్థానం నుంచి 9వ స్థానం వరకు దాతలు మైనేని రత్నప్రసాద్, మాదినేని హరికృష్ణలు రూ.60,000, విజయసారధి రూ.50,000, గౌతమ్ గ్రాండ్ రూ.40,000, కాట్రగడ్డ వెంకటేశ్వరరావు రూ.35,000, మద్రాసు సాంబశివరావు రూ.30,000, కనకమేడల మురళి రూ.25,000, ఈడ్పుగంటి వరప్రసాద్, కొత్తపల్లి శ్రీనివాసరావు రూ.15,000, కేసినేని జయదేవ్ రూ.10,000 బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.



సేద్యం విభాగంలో ప్రథమ స్థానం సాధించిన పెదగొట్టిపాడు ఎడ్ల జత

డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు



తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బస్సును నిర్లక్షంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన ఆర్‌టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 31వ తేదీన ఆర్‌టీసీ బస్టాండ్ రోడ్డులో నడచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని విజయవాడ నుంచి తెనాలి డిపోకి వస్తున్న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని జిల్లా వేద్యశాలకు తరలించగా మృతి చెందాడు. బుధవారం 36వ వార్డు వీఆర్‌వో బీ రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 38 సంవత్సరాలు ఉంటాయని బ్లూజీన్స్ ప్యాంటు, ఆఫ్ చేతులు చొక్కా ధరించి ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బయట పడిన హత్యాయత్నం ప్రణాళిక ఆడియో

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

నూజెండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం చేసిన పథక రచన ఆడియో బయట పడటంతో ఐనవోలులో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అల్లిబాయి పాలెం గ్రామానికి చెందిన కర్నాటి వెంకటరావు, అదే గ్రామానికి చెందిన మీరావలికి గతంలో నగదు అప్పుగా ఇచ్చి ఉన్నాడు. ఈ విషయమై జరిగిన లావాదేవీల్లో మీరావలి తన తమ్ముడు లాలయ్యతో కలసి హత్యాయత్నం పథకం గురించి ఫోన్‌లో చర్చించిన ఆడియో బహిర్గతం కావటంతో బాధితుడు వెంకటరావు ఫిర్యాదు మేరకు మీరావలి, లాలయ్యలపై కేసు నమోదు చేశామన్నారు.

70 కాదు.. 140 మీటర్లు

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఇపుడు అది 140 మీటర్లకు చేరుకోవడంతో వ్యయం రూ.5 వేల కోట్లను మించే అవకాశంఉంది. మొత్తం ఓఆర్‌ఆర్ అంచనా రూ.20 వేల కోట్లు అవనున్నది.

ఓఆర్‌ఆర్‌తో పాటే ఐఆర్‌ఆర్ కూడా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఓఆర్‌ఆర్‌తో సంతృప్తి చెందకుండా ముందు ప్రతిపాదించిన విధంగా అంతర వలయ రహదారి(ఐఆర్‌ఆర్) నిర్మాణంపై కూడా దృష్టి పెట్టింది. ఓఆర్‌ఆర్ నిర్మాణ వ్యయం భరించనున్న నేపథ్యంలో ఐఆర్‌ఆర్‌ను పక్కన పెట్టాలని కేంద్రం దాదాపుగా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఆర్‌ఆర్ విషయమై ఇంకా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌ఆర్ నిర్మాణానికి ముందుకురాని పక్షంలో పీపీపీ విధానంలో అయినా నిర్మించి తీరాలన్న కృతనిశ్చయంతో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తుంది.

అనుమతుల్లేని లే అవుట్లపై చర్యలు

రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ సునీత

వినుకొండటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని లే అవుట్లపై చర్యలు తీసుకుంటామని రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ బీ సునీత తెలిపారు. పట్టణంలోని అరుణ హాల్ ఎదురుగా ఉన్న ఏబీఎం కాంపౌండ్ ఆవరణలో అక్రమంగా నిర్మిస్తున్న 3 అంతస్తుల భవనాన్ని సునీత బుధవారం పరిశీలిం చారు. దారా వెంకట శేషమ్మ అక్రమంగా నిర్మిస్తున్న 3 అంతస్తుల బిల్డింగ్‌పై గత నెల 17వ తేదీన కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్‌కు గోళ్ల హిమ బిందుప్రియ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు నూతనంగా నిర్మిస్తున్న భవనం తనిఖీకి వచ్చినట్లు సునీత తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కారంపూడి రోడ్డు తారకరామ నగర్‌లోని అపార్ట్‌మెంట్లతో పాటు అదే రహదారిలోని ఆదిత్య స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడుతూ 2023 సంవత్సరంలో అపార్ట్‌మెంట్‌లకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో పూర్తి చేసి నివాస యోగ్యానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. వినుకొండ పరిసర ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లపై ప్రశ్నించగా త్వరలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయ ఆవరణ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా 5 అడుగుల స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలని, లేనిపక్షంలో బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు నిరాకరించడం జరుగుతుందన్నారు. 2019 జూన్ 30 నాటి అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఐఏఎల్‌పీ అయి ఉండి ప్రపోషనేట్ ఓపెన్ సెస్ చార్జీలతో పాటు 33.3 శాతం పీనలైజేషన్ చార్జీలు చెల్లించినట్లయితే అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. వినుకొండ పాత పట్టణంలో కనీసం 10 అడుగులు రోడ్డు ఉన్న ప్రాంతంలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఏ (జిల్లా ప్లానింగ్ అధికారి) పూర్ణచంద్రారెడ్డి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.



కారంపూడి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న సునీత

కుమార్తె మరణాన్ని తట్టుకోలేక తల్లి ఆత్మహత్య



రజని (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కుమార్తె అకాల మరణంతో మనస్తాపం చెంది తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్ల పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలోని మండాది రోడ్డులో గల విశ్వబ్రాహ్మణ కాలనీలో తాళ్లూరి శ్రీనివాసాచారి, రజని (37) దంపతులు నివాసం ఉంటున్నారు. ద్వితీయ కుమార్తె అఖిల ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె అకాల మరణాన్ని జీర్ణించుకోలేక తల్లి రజని బుధవారం మధ్యాహ్నం భర్త పనులపై బయటకు వెళ్లగా పెద్ద కుమార్తె రమ్య వాష్‌రూంకు వెళ్లింది. ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పక్కింటి మహిళ రమణ చూసి కేకలు వేయగా వాష్‌రూంలో ఉన్న పెద్ద కుమార్తె రమ్య బయటకు వచ్చేసరికి అప్పటికే రజని ప్రాణాప్రాయ స్థితిలో ఉంది. స్థానికులు రజనీని ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్లు చనిపోయినట్లు ధ్రువీకరించారు. పట్టణ సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ సంధ్యారాణిలు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ హైమారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జోన్ - 3 పరిధిలోని గుంటూరు,పల్నాడు, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె. సాంబశివ రావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర శాఖ అధ్యక్షులు పీ సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి పి లలిత బాబు, జిల్లా నాయకులు ఏపీ కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

రైల్వేలో గ్రూప్ డీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో గ్రూప్ డీ ఉద్యోగాల కోసం అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎంవీ రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీ కుమారిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన రెండు రాష్ట్రాల్లోని వివిధ నగరాలలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని, విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఎఫ్ సంస్థ నేతృత్వంలో మూడు నాలుగు నెలల పాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూల్ నగరాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 9866 777 870 నంబర్‌లో సంప్రదించాలని ఎంవీ రామిరెడ్డి కోరారు.

గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం రైలు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 3వ తేదీ గురువారం గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలుని నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07011 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు గురువారం రాత్రి 8.15కి బయలుదేరి 10.43కి నడికుడి, 11.13కి పిడుగురాళ్ల, 11.43కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.30కి గుంటూరు, శుక్రవారం ఉదయం 9.30కి విశాఖపట్టణం చేరుకొంటుందన్నారు. విశాఖపట్టణం వెళ్లే ప్రయాణీకులు ఈ ప్రత్యేక రైలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని డీఆర్‌ఎం విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా నాణ్యమైన పరికరాల పంపిణీ

- ఏపీ ఆగ్రోస్ కార్యాలయం ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వ్యవసాయ పరికరాలను ఎఫ్‌ఎం-యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ చేశామని ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 'కొటేషన్లతో కొట్టేశారు...... సబ్సిడీ యంత్రాల్లో కమీషన్ల మోత' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కార్యాలయ వర్గాలు స్పందించాయి. ఈ ఏడాది రైతులకు పంపిణీ చేసిన సబ్సిడీ వ్యవసాయ యంత్రాల ధరలు 2022 తో పోలిస్తే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొటేషన్ పద్ధతిలో వ్యవసాయ యంత్రాల ధరలు నిర్ణయించ లేదని, కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. మార్కెటులో డీలర్లు రైతులకు బిల్లులు ఇవ్వకుండా, వారంటీలేని పరికరాలను ఇవ్వడం అనవాయి తీగా జరుగుతుందని అన్నాయి. సబ్సిడీ ద్వారా పంపిణీ చేసే పరికరాలకు తప్పకుండా జీఎస్టీ బిల్లు ఇవ్వాలని, తద్వారా 12 శాతం పన్ను వసూలు చేయటం తోపాటు, 2 శాతం ఏపీ ఆగ్రోస్‌కు చెల్లించాల్సి రావటం వల్ల ధరల్లో వ్యత్యాసం ఉన్నట్లు పేర్కొన్నాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 518.40 అడుగులు ఉంది. ఇది 146.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6248 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 7913 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 7913 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,311 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

1,28,132 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,30,848 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,28,132 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 56,061 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13400	సింజెంటా		
273	10000	12900	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14000	దేవనూరు డీలక్స్	10300	12700
4884	10000	11900	ఆర్మూరు	10000	11300
సూపర్ 10	--	--	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10300	13600			



గోపాలకృష్ణారెడ్డికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

సమస్య మీది... పరిష్కరించే బాధ్యత నాది

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- బేతనీకాలనీలో 'మనవార్డు మన ఎమ్మెల్యే'

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల మధ్య పర్యటిస్తూ అడుగడుగున వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ పరిష్కరించే బాధ్యత నాదని భరోసానిస్తూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బుధవారం బాపట్లలోని 1వవార్డు బేతనీకాలనీలో 'మనవార్డు-మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనేదే నా సంకల్పం అంటూ ప్రజల అభీష్టం మేరకు పనిచేస్తానని వార్డు ప్రజలకు వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. బేతనీ లెప్రసీకాలనీలో దరఖాస్తు చేసుకొని పెన్షన్‌లు రానివారిపై ప్రత్యేక దృష్టిసారించి వెంటనే మంజూరు చేసేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో మురుగునీటి కాల్వలు ఆధునీకరించి సిల్ట్ వెంటనే తొలిగించి డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డికి సూచించారు. రహదారుల సమస్యలను గుర్తించి మరమ్మతులు చేపట్టే విధంగా చూడాలన్నారు. వార్డులో పర్యటిస్తుండగా గునిమిని గోపాలకృష్ణారెడ్డి పక్షవాతంతో బాధపడుతున్నట్లు తెలుసుకొని బాధితుడిని పరామర్శించి వేగేశన ఫౌండేషన్ ద్వారా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అతనికి పెన్షన్ ఇప్పించాలని అధికారులకు సూచించారు. ఈ విధంగా ఇంటింటా తిరుగుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుంటూ తక్షణమే పరిష్కార మార్గం చూపాలని ఆయాశాఖల అధికారులకు సూచిస్తూ మనవార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ, సోముల ప్రసాద్, భీరం మరియమ్మ, చెన్నుపాటి హైమావతి, రమాదేవి, షేక్ నజ్మా, సలగల సురేష్, శీలం శ్రీనివాసరావు, కూచిపూడి శ్యామ్ సుందర్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుష్ఠు రోగుల ఆసుపత్రిని సందర్శించి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలి : ఫ్యాప్టో

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ 30శాతం వెంటనే ప్రకటించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పిచ్చయ్య అధ్యక్షతన ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా నేటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న 12వ పీఆర్సీ, ఐఆర్‌ను ప్రకటించకపోవటం శోచనీయమన్నారు. రాష్ట్ర నాయకులు సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో కో ఛైర్మన్ కె.వినయ్‌కుమార్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీవో నెంబరు 57 ద్వారా పాతపెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలన్నారు. చనిపోయిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్యనియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు ఇచ్చి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. ఉపాధ్యాయులపై గత ప్రభుత్వంలో పెట్టిన పోలీసు కేసులను మాఫీ చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కో ఛైర్మన్‌లు అమర్‌నాథ్, బత్తుల వెంకటేశ్వర్లు, పీడీ సోషలిజం, బడుగు శ్రీనివాసరావు, అడుగుల శ్రీనివాసరావు, ఉదయశంకర్, టి.శ్రీనివాసరావు, విజయబాబు, జె.శ్రీనివాసరావు, సుభానీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఫ్యాప్టో ఉపాధ్యాయులు

ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలి

- బాపట్లలో క్రైస్తవ సంఘాల ప్రతినిధుల శాంతి ర్యాలీ

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బాపట్ల పట్టణ క్రైస్తవ సంఘాల ప్రతినిధుల బృందం బుధవారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. సూర్యలంక రోడ్డు నుంచి దగ్గుమల్లివారిపాలెం మీదగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడ నుంచి గడియారస్తంభం మీదగా పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించి తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. వినపతిపత్రం అందజేసేందుకు తహసీల్దార్ అందుబాటులో లేకపోవటంతో వారంతా అక్కడ బైఠాయించి నినాదాలు చేశారు. సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించేందుకు నిరాకరించి తహసీల్దార్ రావాలని డిమాండ్ చేస్తూ పాతబస్టాండ్‌కు చేరుకొని జీబీసీ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో పట్టణ సీఐ ఆర్.రాంబాబు ఆందోళనకారులతో చర్చించి అధికారులతో మాట్లాడి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఫణికుమార్‌ను పిలిపించటంతో ఆయనకు కూడా వినతిపత్రం ఇవ్వటానికి నిరాకరించి కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. చివరకు పోలీసులు సర్దిచెప్పటంతో వినతిపత్రం అందజేశారు. క్రైస్తవ సంఘ కాపరులు మాట్లాడుతూ క్రైస్తవుల మనోభావాలను కాపాడాలన్నారు. ప్రవీణ్ పగడాల మృతిపై వాస్తవాలు వెలికితీసి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డబ్ల్యు కోల్, డాక్టర్ డీవీ కృపాకరరావు, డాక్టర్ జి.చార్వాక, పాస్టర్ అజయ్‌బాబు, జీఏ మణిభూషణ్, జి.జాన్‌వెస్లీ, కాగిత సుందర్‌దాసు, చింతా ఏసురత్నం, ఎం.పవిత్రకుమార్, రాహుల్‌దేవ్, సాల్వేషన్ ఆర్మీ డీసీ మేజర్ వి.ఏసుపాదం, పాస్టర్ అశోక్ కుమార్ ఆయా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

టీడీపీ సభ్యత్వ కార్డులు అందజేత



టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందజేస్తున్న చిత్రం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనవారిపాలెం గ్రామ పంచాయతీలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను టీడీపీ గ్రామ అధ్యక్షుడు కలకోట చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ గ్రామ జనరల్ సెక్రటరి ఇంటూరు శివయ్యకు అందజేశారు. గ్రామపంచాయతీలలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి చందోలు కోటిలింగాచారి, మాజీ సర్పంచ్ భవనం బసివిరెడ్డి, శేషగిరి, కలకోట రామశేషరెడ్డి, పాలపర్తి సంజయ్య, రవి, నగేష్, బొలగాని శ్రీను, బండారు వెంకటేశ్వర్లు, దావీదు, పాలపర్తి పోలేరు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి కృషి చేయాలి

- సౌకర్యాల కల్పనకు సహకరిస్తా
- కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఆనందబాబు



కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన వారిని సత్కరించి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఆసుపత్రి మీటింగ్ హాలులో సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్ అధ్యక్షతన నూతనంగా ఏర్పాటైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశం బుధవారం నిర్వహించారు. కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే హాజరై ముందుగా సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కమిటీ సభ్యులుగా నియమితులైన గొట్టిపాటి నరహరిప్రసాద్, వేల్పుల రవిప్రసాద్‌లను సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ, రూ.9 కోట్ల వ్యయంతో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్న దృక్పధంతో 2018లో టీడీపీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఆనాడు ఒక బ్లాక్ మాత్రమే నిర్మాణానికి నోచుకుందని, జగన్ ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేయగా వాటిని పూర్తి చేసి ప్రారంభించారన్నారు. నియోజకవర్గ స్థాయిలో 30 పడకల ఆసుపత్రికి ప్రభుత్వం నుంచి గతంలో తన హయాంలోనే పర్మిషన్ తేవడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో దాదాపుగా అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యుల నియామకం కూడా జరిగిందని, ఒకరిద్దరూ వైద్యులను త్వరలో నియమించడం జరుగుతుందన్నారు. అవసరమైన సౌకర్యాల కల్పనకు వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సిబ్బంది తమ విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులకు ప్రోటినెక్స్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, సర్పంచ్ సజ్జా లక్ష్మితిరుపతమ్మ, తహసీల్దార్ సుశీల పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి మేలు

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వైసీపీ పాలనలో ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. వారి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యారన్నారు. అలాంటివారి సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కొందరు పెన్షన్ల కోసం మరి కొందరు ఉద్యోగాల కోసం, విద్య, వైద్యసాయం కోసం అర్జీల రూపంలో ఎమ్మెల్యేను అభ్యర్థించారు. వారి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట నారాయణరావు, తానికొండ దయాబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

వైద్యసేవలు విస్తృతం చేసేందుకు కృషి చేస్తా : వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయం వెనుక శ్రీ వేంకటేశ్వర పాలిక్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఆసుపత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వైద్య సేవలు విస్తృతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రమేష్, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, బాపట్ల, పొన్నూరు మున్సిపల్ కమిషనర్లు జి.రఘునాథరెడ్డి, రమేష్‌బాబు, టీడీపీ బీసీ సెల్ నాయకులు ఎం.శేషు కృష్ణ, కె.భాస్కరరాజు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ వ్యర్థాలు పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని, అవి మానవాళి ఆరోగ్యంపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టి.ప్రసూనారాణి తెలిపారు. మండలంలోని కొండుభొట్లపాలెం ఎస్సీకాలనీలో బుధవారం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో వ్యవసాయ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసూనారాణి మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోతే నీటికాలుష్యం, ఫలదీకరణ, జీవవైవిధ్యం క్షీణత వంటి విపరీతమైన పరిణామాలు సంభవిస్తాయన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుశీల వ్యర్థాల నిర్వహణ ద్వారా సాగు ఖర్చును తగ్గించే విధానాలను సూచించారు. సేద్యవిభాగాధిపతి డాక్టర్ కె.చంద్రశేఖర్ వివిధ కంపోస్ట్ విధానాలు, వేస్ట్ డీ కంపోస్ట్ విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పశు పోషకులకు నట్టల నివారణ మందు, పాల దిగుబడికి, ఎదకు రావటానికి మినరల్ మిక్చర్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల పశు వైద్యాధికారి డాక్టర్ కె.విజయప్రకాష్, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, బోధన సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ పొందిన వారికి కిట్‌లు అందజేస్తున్న అసోసియేషన్ డీన్ డాక్టర్ ప్రసూనారాణి తదితరులు

స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల ఏర్పాటు

వేమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయిని బి.భాగ్యమ్మ అధ్యక్షతన విద్యార్థులను స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాలుగా ఏర్పాటు చేశారు. స్కౌట్స్ యూనిట్లు పింగళి వెంకయ్యగా నామకరణం చేసి, గైడ్స్ యూనిట్లు సావిత్రిబాయి పూలేగా నామకరణం చేశారు. 16 మంది బాలురు, 16 మంది బాలికలతో ఏర్పాటు చేసిన బృందాలకు స్కౌట్ మాస్టర్‌గా గణిత ఉపాధ్యాయుడు ఎం.పార్థసారథి, గైడ్ కెప్టెన్‌గా తెలుగు ఉపాధ్యాయిని పి.శాంతిశ్రీ వ్యవహరిస్తారని హెచ్ఎం భాగ్యమ్మ తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కృష్ణమూర్తి

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి కోరారు. పార్టీశ్రేణులతో కలిసి గురువారం రథంబజారులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ప్రభుత్వం నుంచి కేవలం 10 శాతం మాత్రమే కొనుగోలు చేయటం సరికాదన్నారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి మాట్లాడుతూ శ్రీ భావన్నారాయణస్వామి దేవాలయాన్ని ఆధునీకరించి గాలిగోపురం, రథశాల, రామానుజ కూటమి వంటివి నిర్మించిన మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతిని ఆహ్వానించకుండా నూతన రథాన్ని తీసుకురావటం సరికాదన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, జిల్లా యువజన అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, దివ్యాంగుల జిల్లాఅధ్యక్షుడు చల్లారామయ్య, జోగి రాజా, వెంకట్రావు, సముద్రాలు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు

ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి 28 అర్జీలు

రేపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, నియోజకవర్గంలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 28 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని ఎక్కువ భూసమస్యలు, అడంగల్‌పేర్లు, పాస్‌పుస్తకాలు, సర్వే, పెన్షన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేశారన్నారు. మున్సిపాలిటీలో సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని వీటన్నింటిని ఆయా కార్యాలయాల అధికారులకు తెలిపి పరిష్కరించేలా కృషిచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీఛైర్మన్ పంతాని మురళీధరరావు, బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, సాయిగోపి పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవలందించాలి

- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పారా లీగల్ వాలంటీర్లు నిస్వార్థంగా సేవలు అందించాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలపై ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ వారి సూచనల మేరకు రేపల్లెన్యాయ సేవాధికారసంస్థ పరిధిలో బుధవారం పారాలీగల్ వాలంటీర్లను నియమించారు. వారికి నియామకపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు న్యాయసేవ అందించేందుకు పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలన్నారు. లీగల్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, తాహీర్ అహ్మద్, ఆశా మోషే పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

వేమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి రెండు గ్రామాల్లోని ఐదుగురు లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. వివిధ వ్యాధులకు సంబంధించి చికిత్స అందుకున్న వారిలో చావలి గ్రామానికి చెందిన సోమరౌతు బసవేశ్వరరావు రూ.98,836, మద్దా హేమలత రూ.35,227, గుర్రం బ్రహ్మాచారికి రూ.30,614, అబ్బనగూడవల్లికి చెందిన శోభిల శ్రీనివాసరావు రూ.37,112, బత్తుల నాగలక్ష్మికి రూ.22,900 చెక్కులను అందజేశారు.



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ అధ్యక్షుడు బ్రహ్మరాజు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎన్ఎంయూఏ కార్మికులు బ్యాడ్జీలను ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌లను పూర్తి స్థాయిలో అమలు జరపాలన్నారు. ఆర్టీసీలోని అన్ని క్యాటగిరీల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ సాగర్, గ్యారేజీ సెక్రటరీ వాకా వెంకటనారాయణ, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ ఏఈ ఎ.శివనాగిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ పట్టణంలోని నల్లూరు హాస్పటల్ రోడ్డు, చావలి వారివీధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా అంతరాయం ఏర్పనున్నదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రెండో విడత భూముల రీసర్వే

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలకు సంబంధించి రెండో విడత రైతులకు చెందిన భూములను రీసర్వే చేయటం జరుగుతుందని పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని రీసర్వే కార్యక్రమానికి సంబంధించి పోతనకట్టవారిపాలెం గ్రామపంచాయతీలో, పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీకి సంబంధించి పిట్టువారిపాలెం గ్రామ పంచాయతీలో ర్యాలీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన రైతులందరూ ఈ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఓపీడీ సేవలు అందుబాటులోకి తేవటం అభినందనీయం

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏరియా వైద్యశాల సమీపంలో విజయ హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన ఓపీడీ సేవలను డాక్టర్ వి.కృపాకరరావు బుధవారం ప్రారంభించారు. వ్యాధి నిర్ధారణ కోసం దూరప్రాంతాలకు వెళ్ళకుండా బాపట్లలోనే అధునాతన డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయటం ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మీనా, డాక్టర్ యాని మేరీ ప్రశాంతి, అజంతుల్లా, జ్యోతి, మునీరాజు, మదుసాల్మన్, వినోద్‌కుమార్, మానవతా సేవాసంఘ సభ్యులు పాల్గొన్నారు.



కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న వ్యాపారి

కొబ్బరి బొండాలకు పెరిగిన గిరాకీ

- ధర పెరిగిన కొనుగోలుకు వెనుకాడని ప్రజలు
- లీటరు కొబ్బరినీళ్లు రూ.100 ● బొండం కనీస ధర రూ.25

వేమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వేసవి వస్తే చాలు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందాలంటే కొబ్బరి నీళ్ల తాగితే సరిపోతుంది.. అనుకుంటూ ప్రతి ఒక్కరూ ధర ఎంతైనా కొబ్బరి కొండాలు కొనుగోలు చేసి తాగుతుంటారు. ఆరోగ్యపరంగా దోహదపడే కొబ్బరి బొండాల అమ్మకాలు ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే జోరందుకున్నాయి. గ్రామాల్లోనే కాకుండా రహదారుల వెంట కూడా కొబ్బరి బొండాల అమ్మకందారులు సంఖ్య పెరిగింది. వేసవి తాపంరోజు రోజుకు పెరుగుతుంటే దానిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కొబ్బరి బొండాల నీరు ఉపశమనం ఇస్తుందని భావిస్తారు. కొబ్బరి నీళ్లలో విటమిన్లు, మినరల్స్ ఎలక్ట్రోలైట్స్ ఎంజైమ్స్ ఏమినో యాసిడ్లు సైటోకిన్ అత్యధికంగా ఉంటాయి. అలాంటి కొబ్బరి నీళ్ల తాగితే తప్పనిసరిగా ఉపశమనం ఇస్తుందన్న ఆలోచనతో ధరకు కూడా వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. బయటకు వెళ్లే వాళ్లు వేడిని తట్టుకోలేకపోతున్నారు. ఇతర చల్లని పానీయాల కన్నా కొబ్బరి బొండాల వ్యాపారం ప్రతి గ్రామంలోనూ అధికంగా కొనసాగుతోంది. లంక గ్రామాలతో పాటుగా గోదావరి జిల్లా నుంచి దిగుమతి అవుతున్న బొండాలను స్థానిక వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కాగా వేసవిలో వాటి ధరలు ఎండలు మండినట్లుగా మండుతున్నాయి. ఒక్కో బొండం ధర కనీసం రూ.25 కాగా లీటరు రూ.100, అర లీటరు సీసా రూ.50లకు అమ్ముతున్నారు. వైద్యులు కూడా ఇతర శీతల పానీయాల కన్నా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ లాంటి ద్రవ పదార్థాలను తీసుకోవడం మేలు అని సూచిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ సీనియర్ నాయకుడు శివప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం తుమ్మల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.12లక్షలతో సీసీ రహదారులను అభివృద్ధి చేయగా దానిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలనలో గ్రామాలను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని, రహదారుల కోసం తట్టడిమట్టి కూడా వేయలేదన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి గ్రామంలో ఉన్న రహదారులను అభివృద్ధి చేసిందన్నారు. ప్రతి పంచాయతీకి రూ.25 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశామని వాటితో నియోజకవర్గంలో 80 శాతం రహదారులు అభివృద్ధి చేయటం జరిగిందన్నారు గ్రామాల అభివృద్ధి కోసం మంత్రి అనగాని ప్రత్యేక దృష్టిసారించి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, రేపల్లె సురేష్, రేపల్లె రామాంజనేయులు, రేపల్లె పాపారావు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మల గ్రామంలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న అనగాని శివప్రసాద్

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

కొల్లూరు, భట్టిప్రోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ఉచితంగా వారికి అవసరమైన ఉపకరణాలు అందించేందుకు ఓ సంస్థ ముందుకు వచ్చిందని కొల్లూరు, భట్టిప్రోలు ఎంపీడీవోలు కె.నరసింహారావు, ఎస్.వెంకటరమణలు బుధవారం తెలిపారు. నెల్లూరుకు చెందిన అలింకో సహకార సంస్థ వారు దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు తదితర ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి సర్క్యులర్ జారీ చేసినట్లు ఎంపీడీవోలు తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు గ్రామాల్లోని అన్ని పంచాయతీల్లోని దివ్యాంగులందరూ ఇంటింటి సర్వే ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు సచివాలయంలో ఉపకరణాలు పొందేందుకు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికి కలెక్టర్ నిర్ణయించిన తేదీల్లో ఆయా గ్రామాలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి నెల్లూరులోని అలింకో సంస్థ వద్దకు తీసుకువెళ్లి దివ్యాంగులకు పరికరాలను అందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సదవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవోలు కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రేపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ పి.విజయలక్ష్మి అన్నారు. రేపల్లె ఆర్టీసీ డిపో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యక్షుడిగా కె.రమేష్‌బాబు, గౌరవాధ్యక్షుడిగా పి.స్టాలిన్‌బాబు, సెక్రటరీగా కె.చంద్రశేఖర్‌లను ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు. మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. అనంతరం ఆర్టీసీ డీఎం సుఖవాసి సునిల్‌కుమార్‌ని కలిసి పరిశీలన చేస్తున్నారన్నారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి కార్మికుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



రేపల్లె డిపో పరిధిలోని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

జడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ రూమ్ ప్రారంభం


భట్టిప్రోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆధునీకరించిన డిజిటల్ క్లాసు రూమ్‌ను దాత చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుధవారం ప్రారంభోత్సవం చేయించారు. కృష్ణా జిల్లా ఆముదాల లంక గ్రామానికి చెందిన వేములపల్లి రాఘవేంద్రరావు మండల పరిధిలోని పెసర్లంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని డిజిటల్ క్లాసు రూమ్‌ను రూ.90 వేలతో ఆధునీకరణ చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు సమక్షంలో ఆ గదిని దాత ప్రారంభించారు. అనంతరం ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు శ్రీలంకలోని విద్యార్థులతో అక్కడి ఉపాధ్యాయుడు శరత్‌జయరత్నే ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో సంభాషణలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ సుభాని, విద్యాకమిటీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం సురేష్‌కుమార్, గ్రామపెద్దలు వేములపల్లి వీరాంజనేయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



- రేషన్ షాపుల వద్ద కొలిక్కిరాని ప్రక్రియ
- మూడు జిల్లాల్లో 5 లక్షల పైచిలుకు పెండింగ్
- నెలాఖరు వరకూ గడువు పొడిగింపు..
- ఆ లోగా పూర్తి కాకుంటే రేషన్ కట్..
- ఈనెల కూడా కనిపించని కందిపప్పు

ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ

రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ ప్రక్రియ నత్త నడకన సాగుతోంది. మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం పౌర సరఫరాల శాఖకు ఆదేశాలు ఇచ్చినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. రేషన్ షాపులకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకునేందుకు కార్డు సభ్యులు ఆసక్తి చూపకపోవడం, కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడం వంటి పలు కారణాలతో మార్చి 31 నాటికి పూర్తి కావాల్సిన ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో ప్రభుత్వం గడువును మరో నెల రోజులకు పెంచింది. ఏప్రిల్ 30 వరకూ జరిగే ఈ ప్రక్రియలో కార్డు దారులకు మరింత వెసులుబాటు కల్పించేలా ఎండీయూ వాహనాల వద్దే ఈ- కేవైసీ చేయించుకునే సదుపాయం కల్పించారు.



ఈ-కేవైసీ పూర్తయినవి పచ్చరంగు, పెండింగ్ ఎరుపు రంగులో

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 5,99,558, పల్నాడు జిల్లాలో 6,45,126, బాపట్ల జిల్లాలో 4,86,151 కార్డుల చొప్పున మూడు జిల్లాల్లో 17,30,835 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిపై 48,63,305 మందికి రేషన్ అందుతోంది. వీరిలో మూడు జిల్లాల్లో 5 లక్షల పేర్ల వరకూ పెండింగ్ ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ- కేవైసీ ప్రక్రియ గతంలో జరిగిన సమయంలో చిన్నారుల వేలు ముద్రలు పడకపోవడం వంటి కారణాలతో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నెంబర్‌తో పేర్లను కార్డులో జత చేశారు. అయితే ఇప్పుడు వారిలో ఐదేళ్లు దాటినవారు ఉంటే వారి చేత ఈ- కేవైసీ చేయిస్తున్నారు. వారితోపాటు వలస పనులకు వెళ్లినవారు అనేక మంది ఈ-కేవైసీ చేయించుకోలేకపోయారు. వారికి కూడా ఈసారి అవకాశం కల్పించారు. వారు తాము పనిచేసే ప్రాంతాల్లోనే మీ-సేవ, ఈ- సేవా కేంద్రాలకు వెళ్లి ఈ- కేవైసీ చేయించుకునే అవకాశం కల్పించారు. అయితే కిందటి నెల ఈ- కేవైసీ బాధ్యతను రేషన్ డీలర్లకు అప్పగించారు. రేషన్ సరుకులు ఇళ్లకే వస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పనిగట్టుకుని రేషన్ షాపులకు వెళ్లాల్సి రావడంతో ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ప్రక్రియ మందకొడిగా సాగింది. ఈ నెల రేషన్ సరుకులు ఇచ్చే సమయంలోనే ఎండీయూ వాహనం వద్దే ఈ- కేవైసీ చేయించుకునేందుకు అవకాశం కల్పించడంతో ప్రక్రియ ముందుకు సాగుతుందని అధికారులు భావిస్తున్నారు.

● సంక్షేమ పథకాల కోసం తప్పుకున్న కొందరు..

రేషన్ కార్డులో పేర్లు ఉండి ప్రభుత్వ ఉద్యోగం పొందినవారు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేవారు, ఇన్‌కమ్ టాక్స్ చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహనదారులు చాలా మంది గత ప్రభుత్వ ఏరివేత విధానాల కారణంగా ఈ కేవైసీకి దూరంగా ఉన్నారు. కార్డు సభ్యుడిగా ఈ- కేవైసీ చేయించుకుంటే ఆ పథకాలు దూరమవుతాయన్న కారణంగా తప్పుకున్నారు. అలాంటి వారందరితో తప్పనిసరిగా ఈ- కేవైసీ చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు కూడా ఈ- కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కట్ చేస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు.

● ఈ- కేవైసీ ఇలా..

ఎండీయూ వాహనాల వద్ద రేషన్ తీసుకునే సమయంలో ఈపోస్ యంత్రంలో ఆయా కార్డుల్లో నమోదైన సభ్యుల పేర్లు స్ర్కీన్‌పై వస్తాయి. ఈ- కేవైసీ పూర్తయిన సభ్యుల వివరాల వద్ద పచ్చరంగు బార్ వస్తుంది. ఈ కేవైసీ స్టేటస్ వద్ద వెరిఫైడ్ అని వస్తుంది. ఈ- కేవైసీ పెండింగ్ ఉన్న పేర్ల వద్ద ఎర్ర రంగు బార్ వస్తుంది. ఈ కేవైసీ పెండింగ్ అని చూపుతుంది. అలా ఈ-కేవైసీ పెండింగ్ ఉన్నవారు అక్కడే బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.

● ఈనెల కూడా కనిపించని కందిపప్పు

కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు మూడు నెలలపాటు అందుబాటులోకి వచ్చిన కందిపప్పు, జొన్నలు, రాగులు మూడు నెలలుగా కనిపించడం లేదు. ఈ నెల నుంచి కందిపప్పు పంపిణీ పునఃప్రారంభమవుతుందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. దీంతో అనేక మంది లబ్ధిదారులు కందిపప్పు కోసం ఎదురు చూశారు. కానీ ఈ నెల కూడా కందిపప్పు రాలేదు. దీంతో కార్డుదారులు నిరాశ చెందారు. కందిపప్పు ధర మండిపోతున్న తరుణంలో చౌకధరలో ప్రభుత్వం సరఫరా చేయాలని కోరుతున్నారు.

పల్లె యవనికపై కళాసౌరభం

రేపటి నుంచి పుచ్చలపల్లి సుందరయ్య జాతీయస్థాయి నాటకోత్సవాలు

యడ్లపాడులో మూడు రోజులపాటు నిర్వహణ


యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణం, ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదిక

యడ్లపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కళలు సంస్కృతికి ప్రతిబింబాలు..కళాకారులు సమాజాన్ని జాగృతం చేసే దివిటీలు.. కళాపరిషత్‌లు వాటికి జవసత్వాలు అందించే జీవనదులు. సినిమా, టీవీ, షార్ట్ ఫిల్మ్‌లు ఎంతగా వృద్ధిచెందినా వాటి మూలాలు మాత్రం నాటక రంగస్థలమే. కళలతోనే జీవితం.. కళలే వారి జీవితం అనుకునే తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డలకు సాంస్కృతిక సేవా నిలయంగా నిలుస్తోంది యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం. కళ కళకోసం కాదు.. సమాజ హితం కోసం అంటూ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో రెండు దశాబ్దాలకు పైగా నాటకోత్సవాలను నిర్వహిస్తూ కళామతల్లికి సేవలందిస్తోంది పుచ్చలపల్లి కళానిలయం. తెలుగు నాటకరంగానికి జవసత్వాలు కల్పించి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నూతన ఒరవడితో ముందుకు సాగుతోంది. రేపటి (శుక్రవారం) నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలపై ప్రత్యేక కథనం.

ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో రెండు దశాబ్దాలకు పైగా నాటిక పోటీలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం. గతంలో స్మారక నాటకోత్సవాలుగా మాత్రమే నిర్వహించి ప్రదర్శనా పారితోషికం మాత్రమే అందజేసేవారు. అయితే మూడేళ్ళుగా నిర్వాహకులు నాటకోత్సవాల నిర్వహణలో మార్పులు చేపట్టారు. నాటకాల పట్ల ప్రజల్లో ఆసక్తిని పెంపొందించి చేరువ చేయడంతోపాటు కళాకారులను, నాటక సమాజాలను ప్రోత్సహించేందుకు జాతీయస్థాయి నాటికల పోటీలుగా మార్పు చేశారు.



మెప్పు కాదు.. మార్పు కోసం..

కళ కళ కోసం కాదు.. ప్రగతి కోసం అని చాటి చెప్పిన మహనీయుల మాటలే ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నాం. నాటకోత్సవాలు నిర్వహించడం కత్తి మీద సాములాంటిది. ఎన్ని వ్యయప్రయాసలు ఎదురైనా మహనీయుల మాటలు, ప్రేక్షకుల ఆదరణ ముందుకు నడిపిస్తున్నాయి. కళారంగానికి పరిపుష్టతను అందించేందుకు వినూత్నంగా, విభిన్నంగా అందరినీ ఆకట్టుకునే విధంగా పోటీలకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లైటింగ్ ఎఫెక్ట్స్, స్టేజి అలంకరణ వేటికవే పోటీపడుతూ ప్రదర్శితమయ్యే నాటికలు వాటి ప్రత్యేకతను చాటుకుంటాయన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ఆహ్వాన పత్రిక, లక్కీడ్రా కూపన్లను ఇచ్చి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

-ముత్తవరపు సురేష్‌బాబు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షులు

ఎయిమ్స్ అభివృద్ధిపై కేంద్రమంత్రికి పెమ్మసాని వినతి

మంగళగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి పడకలు (960) ఏర్పాటు చేయించడంతోపాటు ఖాళీగా వున్న 1,045 పోస్టులను భర్తీ చేయించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్స్‌శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో పెమ్మసాని ఆమెను కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏటా అయ్యే రూ.250 కోట్ల ఖర్చును కేంద్రం అదనంగా భరించేలా ఆర్థికమంత్రి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గత నెల 28న డాక్టర్ పెమ్మసాని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా సిబ్బంది ఆయన దృష్టికి ఆయా సమస్యలను తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఈ సమస్యలను కేంద్ర ఆర్థికశాఖమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో 105 ఫ్యాకల్టీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ రెసిడెంట్, నర్సింగ్ కేడర్, నాన్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినతిపత్రంలో వివరించారు. అలాగే సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ మంగళగిరి ఎయిమ్స్‌కు కేటాయించిన మొత్తం 960 పడకలను కూడా పూర్తిస్థాయిలో సత్వరమే అందుబాటులోకి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్ పెమ్మసాని ప్రతిపాదనలపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి మోదీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఎల్లప్పుడూ సహకరిస్తాయని...తప్పక తనవంతు సహకారం అందిస్తానని ఆమె భరోసాను ఇచ్చినట్టు డాక్టర్ పెమ్మసాని తెలిపారు.


కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న పెమ్మసాని

గుంటూరు రైల్వే డివిజన్ చరిత్రలో...

3.451 మిలియన్ టన్నుల సరుకు రవాణా

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణా విషయంలో గుంటూరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు సృష్టించింది. డివిజన్ ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా 3.451 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేసి గత రికార్డులను తిరగ రాసింది. గత ఏడాది 3 మిలియన్ టన్నులను దాటి కొంతమేరకే సరుకులను లోడింగ్ చేయగలిగింది. ఈ ఏడాది మరింత జోరుగా రవాణా చేయడంతో రికార్డు నెలకొల్పినట్లు అయింది. ఇందుకోసం పటిష్టమైన ప్రణాళిక, సిబ్బంది అంకితభావం, టీం వర్క్ తోడైంది. ముఖ్యంగా కమర్షియల్, ఆపరేటింగ్ విభాగాలు సమన్వయంతో పని చేశాయని వాటి విభాగాల అధికారులను డీఆర్ఎం రామ కృష్ణ అభినందించారు. 2024-25 ఆర్థిక సంవత్స రంలో మరికొన్ని విజయాలు కూడా డివిజన్ సా ధించింది. వాటిల్లో గత ఏడాదితో పోలిస్తే డివిజ న్‌లో రైళ్లు, గూడ్స్‌ల వేగం 20 శాతం పెరిగింది. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రాంలో 95.91 శాతం బ్లాక్‌లు మంజూరు చేశారు. ఇప్పటివరకు డివిజన్ మొత్తం 100 లాంగ్ హాల్స్(పొడవాటి గూడ్స్ రైళ్లు)కు సరుకులు లోడింగ్ చేసింది. రైళ్ల సమ యపాలన విషయంలో దేశంలో 10వ స్థానం, దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం.

పరుగులు పెట్టిన పడవల వేలం

◆ ఉమ్మడి జిల్లా పరిషత్ ఆదాయపు పంట ◆ ఈ ఏడాది రూ. 1.46 కోట్ల రాబడి ◆ రూ. 50 లక్షలు పలికిన దిడుగు-ఏటూరు రేవు


బహిరంగ వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేవుల్లో సంవత్సర కాలం పడవలు నడుపుకునేందుకు నిర్వహించిన వేలం పాటలు పరుగులు పెట్టాయి. జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ పాటలు నిర్వహించారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎక్కువ మంది హాజరయ్యారు. అన్ని రేవులకు అధిక మొత్తంలో ఆదాయం వచ్చింది. అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయం వచ్చినట్లుగా తెలుస్తోంది. అమరావతి మండలంలోని దిడుగు-ఏటూరు రేవుకు ఎక్కువ మంది పోటీ పడ్డారు.ఈ రేవులో పడవ నడుపుకునే హక్కు కోసం రూ. 50 లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. అచ్చంపేట మండలంలోని చామర్రు-కాసరబాద రేవుకు రూ.5,15,000, గింజుపల్లి-వేదాద్రి రేవుకు రూ. 14 లక్షలు, తాడువాయి-రామన్నపేట రేవుకు రూ.21 లక్షలు,మాడిపాడు-ముక్త్యాల రేవుకు రూ.30 లక్షల 15 వేలు, పుట్లగూడెం- రామన్నపేట రేవుకు రూ.24.66 లక్షలు, ధరనికోట-కునికినిపాడు రేవుకు రూ. 1.9 లక్షలు చొప్పున చెల్లించి పడవ నడిపే హక్కులు దక్కించుకున్నారు.అచ్చంపేట మండలం లోని చింతపల్లి-ఇస్తేపల్లి, మాడిపాడు-బుగ్గమాదారం, మాచవరం మండలంలోని గోవిందాపురం-చింతిర్యాల, కొల్లిపొర మండలంలోని వల్లభాపురం-వల్లూరి పాలెం రేవుల వేలం పాటలు వాయిదా పడ్డాయి. బల్లకట్టుల హక్కులు పాడుకునేందుకు ఎవ రూ ముందుకు రాలేదు. ప్రస్తుతం నిర్వహించిన వేలం పాటల వల్ల జిల్లా పరిషత్‌కు ఈ ఏడాది రూ.1.46 కోట్ల ఆదాయం వచ్చింది.

కార్పొరేట్ సంస్థలకు ధీటుగా

సోనోవిజన్ వ్యాపార సేవలు

- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి
- కోలాహలంగా సోనోవిజన్ లక్కీడ్రా


సోనోవిజన్ లక్కీడ్రా తీస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి పక్కన సంస్థ ఎండీ భాస్కరమూర్తి తదితరులు


విజేతను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, పక్కన సంస్థ ఎండీ భాస్కరమూర్తి తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కార్పొరేట్ సంస్థలకు ధీటు గా సోనోవిజన్ వ్యాపార సేవలు అందించటం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రశంసించారు. గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని సోనోవిజన్ షోరూంలో సంస్థ మేనేజింగ్ డైరక్టర్ పీ భాస్కరమూర్తి నేతృత్వంలో లక్కీ డ్రా కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గల్లా మాధవి నగరంలోని నాలుగు షోరూమ్‌లలో కొనుగోలుదారుల కూపన్‌లను లక్కీ డ్రాలో తీసి విజేతలను ప్రకటించారు. మొదటి విజేతగా సెల్‌ఫోన్‌ను కొనుగోలు చేసిన ఏటి అగ్రహారంనకు చెందిన నరసింహారావును (కూపన్ నెంబరు 66608) ప్రకటించారు. తొలి విజేతగా ఆయనకు మారుతీ సుజుకీ ఆల్టో 800 కారును అందజేయనున్నట్లు తెలిపారు. అలానే రెండో కూపన్‌ను ఖాతాదారులతో డ్రా తీసి నగరానికి చెందిన అభిరామ్‌ను (కూపన్ నెంబరు 24387) ప్రకటించారు. రెండో విజేతకు ఎల్ఈడీ టీవీ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే మూడో విజేత సీహెచ్ ఆనంద్‌స్వరూప్ (కూపన్ నెంబరు 77611) కు రిఫ్రిజిరేటర్ అందజేయనున్నట్లు చెప్పారు. నాలుగో విజేతగా జీ శ్రీనివాసరావు (కూపన్ నెంబరు 164470) వాషింగ్ మిషన్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎంతో ప్రజాదరణతోనే ఐదు దశాబ్దాలకు పైగా సోనోవిజన్ సుదీర్ఘ వ్యాపార ప్రయాణం చేయగలిగిం దన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను అందజేయటం సంతోషదాయకమన్నారు. మరింత వ్యాపారాభివృద్ధి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సోనోవిజన్ ఎండీ పీ భాస్కరమూర్తి మాట్లాడుతూ 1969లో సోనోవిజన్‌ను స్థాపించి 56 ఏళ్ళుగా ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన బ్రాండ్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. నేటికి ఎనిమిదిన్నర లక్షల మంది కొనుగోలుదారులతో తెలుగురాష్ట్రాల్లో 71 షోరూమ్‌లతో సోనోవిజన్ వ్యాపారం చేస్తుందన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్ గృహోపకర ణాలను జీరో ఫైనాన్స్ వడ్డీతో అందజేస్తున్నామన్నారు. ప్రధానంగా క్రెడిట్ కార్డ్ అమ్మకాలను ప్రోత్సహించేందుకు క్యాష్ బ్యాక్ ఆఫర్లతో విక్రయాలు జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌మేనేజర్‌లు కోనేటి వెంకటేష్, ప్రసాద్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇది మల్లెల వేళయనీ

- పెదవడ్లపూడి, నూతక్కి ప్రాంతాల్లో అత్యధికంగా మల్లెతోటల సాగు
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మల్లె తోటల సోయగం చూడముచ్చటగా ఉంది. సువాసన వెదజల్లే మల్లెతోటల సాగుపట్ల సన్న,చిన్నకారు రైతులు ఆసక్తి చూపుతున్నారు. 10 సెంట్ల భూమి దగ్గర నుంచి ఎకరాలలో కూడా దీనిని సాగు చేస్తున్నారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురం,బేతపూడి, ధరివాదకొత్తపాలెం తదితర గరువు భూములలో సాగు చేస్తున్న తోటల్లో మల్లెపూలు విస్తారంగా పూస్తున్నాయి. జిల్లాలో 507 ఎకరాలలో దీనిని సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ఎంతో సాగు చేస్తున్నారు. మహిళల మనస్సుల్ని దోచే మల్లెపూలతోటలు జిల్లాలో మంచి దిగుబడి ఇస్తున్నాయి. ఈతోటలపై వేలాదిమంది జీవనోపాధి పొందుతున్నారు. బాపట్లప్రాంతంలో 20గ్రామాలు, రేపల్లె ప్రాంతంలో 20గ్రామాలలో, ఉమ్మడి గుంటూరుజిల్లాలో అత్యధికంగా పెదవడ్లపూడి, నూతక్కి గ్రామాలలో మల్లెల సాగు చేస్తున్నారు. ఆ తర్వాత బాపట్లప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. మల్లెపూల సోయగాలతో జిల్లాలోని చాలా ప్రాంతాలు విస్తరించాయి. వెదుళ్ళపల్లి పూలమార్కెట్ నుంచి పెద్దఎత్తున ఇతర ప్రాంతాలకు మల్లెపూలు ఎగుమతి అవుతున్నాయి. ఎంతోకాలంగా ఇక్కడ నుంచి లక్షల రూపాయల మార్కెట్ జరుగుతున్నది.

మల్లెతోటలకు ఆశిస్తున్న తెగుళ్ళు

చూడముచ్చటైన మల్లెతోటలపై కూడా తెగుళ్ళ ప్రభావం ఉంది. ప్రస్తుతం ఎర్రమొగ్గ, రెడ్‌స్పైడర్‌మైట్, ఎర్రనల్లి, ఎండుకొమ్మలు కనిపిస్తున్నాయి. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపడితేనే దిగుబడులు పెరుగుతాయి. లేకుం టే గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కావున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవనశాఖాధికారులు తెలియజేస్తున్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి
పీ జెన్నెమ్మ, జిల్లా ఉద్యానశాఖాధికారి



ఇసుకనేలలో మల్లెసాగు చేస్తున్నారు కాబట్టి కొన్నిచోట్ల ఎర్రమొగ్గ కనిపిస్తున్నది. దీని నివారణకు వర్మికంపోస్ట్ అధికంగా వాడటంతోపాటు క్లోరిఫైరీఫాస్ రెండు మిల్లీలీటర్లు.. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఎండికొమ్మలు కనిపిస్తే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి చొప్పున, ఎర్రనల్లి, రెడ్‌స్పైడర్‌మైట్ కనిపిస్తే సల్ఫర్ 2గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి నివారించుకోవాలి.


బాపట్ల మండలంలో సాగు చేస్తున్న మల్లెతోటలు

కాలువలో నీరు పారేదెట్టా..?

రైతుల్లో ఆందోళన

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం వెంపరాల కొండ మట్టిని తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వెంపరాల కొండ నుంచి నామ్ రోడ్డుకు వచ్చేందుకు చినకొత్తపల్లి మైనర్ 4 కాలువ కట్టను వినియోగిస్తున్నారు. దీంతో కట్టను వెడల్పుగా చదును చేసే క్రమంలో చిల్ల చెట్లు, వ్యర్థాలను పక్కనే ఉన్న కాలువలోకి పడేస్తున్నారు. అసలే మరమ్మతులు లేక నీటి ప్రవాహం సరిగ్గా లేని కాలువ కాస్తా పూర్తిగా పూడిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రావెల్ తరలింపు సుమారు ఏడాది సమయం పట్టే అవకాశం ఉండడంతో సాగర్ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకి కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రావెల్ తరలింపు చేపట్టగా దుమ్ము పంట పొలాలపైకి వచ్చి పంటలు దెబ్బతింటాయని రైతులు అడ్డగించడంతో తాత్కాలికంగా విరమించారు. కాలువ కట్టను చదును చేయడం సరే.... నీటి ప్రవాహం సంగతి ఎలా అని రైతులు ఆందోళన చెందున్నారు. గ్రావెల్ తరలింపునకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాలువ పూడిపోకుండా, పంటలకు నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



చినకొత్తపల్లి మైనర్ 4 కాలువ కట్ట ను చదును చేసి చిల్లచెట్లు, వ్యర్థాలను కాలువలో పడేయంతో అనవాళ్లు కనిపించకుండా ఉన్న కాలువ



అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ కూటమి నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య విశేషంగా పాటుపడుతున్నట్లు టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల వేదిక ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన నివేశన స్థలాలు - 90, పింఛన్‌లు - 40 అర్జీలు స్వీకరించారు. అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు గంజి పురుషోత్తం, గజవల్లి శ్రీనివాసరావు, శివ నాగ మల్లేశ్వరి, పద్మిని, ఆర్‌కే నాయుడు పాల్గొన్నారు.

సారా రహిత ప్రాంతంగా మార్చాలి



నవోదయం 2.0లో ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సారా రహిత ప్రాంతంగా చీరాలను మార్చేందుకు ప్రజలు సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రామానగర్, ఆదినారాయణపురం, ఈపూరుపాలెం, ఉజిలీపేట, దండుబాట, సాయికాలనీ, లక్ష్మీపురం, వాడరేవు ప్రాంతాల్లో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రచారరథం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా వద్దు - ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. సారా నియంత్రణకు 14405కు కాల్ చేసి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణంపై అధికారులు దాడులు

- పెద్ద మొత్తంలో తేడాలు గుర్తింపు
- 6 ఏ, క్రిమినల్ కేసు నమోదు



సరుకు వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, డీటీ గీతారాణి

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని విఠల్‌నగర్ రేషన్ దుకాణం-19పై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈక్రమంలో పేద ప్రజలకు అందించాల్సిన 244 క్వింటాళ్ల రేషన్ బియ్యం, షుగర్ ప్యాకెట్స్ - 460, కందిపప్పు - 418 ప్యాకెట్స్ నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిర్వాహకులపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దాడుల్లో తహసీల్దార్ గోపీకృష్ణ, సివిల్ సప్లయిస్ డీటీ గీతారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. దాడులు నిరంతరం ఉంటాయని పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇతర శాఖాపరమైన అంశాల్లో భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

తాబేళ్ల సంరక్షణకు కృషి చేయండి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరంలో తాబేళ్ల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం రాత్రి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో టౌన్ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వార్డుల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమాలు, ప్రజల సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతేకాకుండా గురువారం తెల్లవారు ఝామున తాబేళ్లను తీరంలోకి వదులుతున్నట్లు చెప్పారు. అలాగే వాటి రక్షణ బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పట్టణ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో టౌన్ క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బూదవాడ విద్యార్థులు



జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పంగులూరు, ఏప్రియల్ 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ)పై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి 21వ శతాబ్దపు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా చీరాలలోని ఎన్‌ఆర్‌పీఎం ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 10 ప్రాజెక్ట్‌లు ప్రదర్శించగా, బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన కె.జగన్మోహనరెడ్డి, బి.చంద్రారెడ్డి, కె.కోటేశ్వరరావు ఆయుర్వేద మెడిసన్ ఫర్ కిడ్నీ ప్రాబ్లమ్స్ (ప్రకృతివైద్యం)పై చేసిన ప్రాజెక్ట్ ఉత్తమ ప్రాజెక్ట్‌గా ఎంపిక కాగా చీరాల ఎన్‌ఆర్‌పీఎం పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ధన్వంతరి దంతసిరి (పళ్లపొడి) ప్రాజెక్ట్ ద్వితీయ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఈ రెండు ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు బూదవాడ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ సుధారాణి తెలిపారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ ప్రాజెక్ట్‌లు ప్రదర్శించనున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

త్వరలో రేషన్ స్మార్ట్‌కార్డులు

- ఈనెలాఖరులోపు ఈకేవైసీ పూర్తయ్యాక చర్యలు చేపట్టే అవకాశం
- ఒకేసారి కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పేదలకు ఇచ్చే రేషన్‌ను కార్డుదారులకు అందించడమే ప్రధాన లక్ష్యంతో అనేక మార్పులకు నాంది పలికింది. అందుకోసం ఇప్పటి వరకు ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు(ఏటీఎం సైజు) కార్డుదారులకు ఇచ్చేందుకు అంతా సిద్ధం చేసింది. రాష్ట్రంలో గతేడాది నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటివి చేపట్టలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రక్రియను కూడా వారం పదిరోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో 6.61 లక్షల రేషన్‌కార్డుల పరిధిలోని సభ్యుల నుంచి ఈకేవైసీ చేపట్టిన ప్రభుత్వం ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేసే విధంగా దిశానిర్దేశం చేసింది. ప్రస్తుతం పంపిణీ జరుగుతుండగా అక్కడే లేని వారికి ఈకేవైసీ చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే కార్డుల్లో చేర్పులు, మార్పులతోపాటు తొలగింపులు చేసేందుకు ప్రభుత్వం అప్షన్లు ఇవ్వనుంది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను ఇవ్వనున్నారు. ఈ కార్డులో ఇంటి కుటుంబసభ్యులు ఎంతమంది ఉంటే అంతమంది ఫొటోలు కూడా ఉండటంతోపాటు పూర్తి అడ్రసు కూడా ఉంటుంది. ప్రస్తుతం అన్నింటిని రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్న పరిస్థితుల్లో ఆ కార్డులను జేబులో పెట్టుకునేందుకు కూడా ఈజీగా ఉంటుంది. ఆ ప్రక్రియ మే నెలల ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటిచడంతో ఆ శాఖ అధికారులు తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు.

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ చేసేందుకు ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు కే.ఎర్రయ్య అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ 11వ వేతన సవరణ కమిషన్ ముగిసి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం కొత్తది ఏర్పాటు చేయకపోవడం దారుణంగా ఉందన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయడంతోపాటు 2003 డీఎస్సీ వారికి కేంద్రప్రభుత్వ మెమో ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 70ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ అమలు చేయాలన్నారు. 117 జీవోను రద్దుచేసి ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా అమలు చేయాలని, ఉపాధ్యాయుల పదోన్నతుల సీనియార్టీ జాబితాలో ఉన్న తప్పులను సవరించి మెరిట్ కం రోస్టర్ ప్రకారం రీ ఆర్గనైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వాటన్నింటిని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎస్ఎండి రఫీ, వి.మాధవరావు, జయరావు, వై.వెంకట్రావు, ఎస్‌కే అబ్దుల్‌హై, వి.జనార్దన్‌రెడ్డి, బి.వెంకట్రావు, కే.శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసులు, పి.వెంకట్రావు, జీవీకే కీర్తి తదితరులు పాల్గొన్నారు.



శారీపై ప్రింటింగ్‌ను పరిశీలిస్తున్న ప్రొఫెసర్‌లు, పాల్గొన్న స్థానికులు

మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధితో నైపుణ్యం పెంచుకుని ఆరికంగా రాణించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. డి.ప్రసూన రాణి అన్నారు. బుధవారం ఈపూరుపాలెం ఐకార్ ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా గ్రామంలో స్వయం ఉపాధి కల్పనపై శిక్షణ అందించారు. హస్తకళల విలువను తెలియజేశారు. చీరలపై హ్యాండ్ పెయింటింగ్, స్క్రీన్ పెయింటింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీవ రసాయన శాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ డా. సంధ్య, డా. హేమ, డా. సుశీల, డా.సువర్ణలత, స్థానిక మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు, భక్తులు

వైభవంగా శ్రీరామ మందిరం ప్రతిష్ఠోత్సవం

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని ఉజిలీపేట ప్రధాన రహదారిలో శ్రీరామ మందిరం ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అర్చకులు కమిటీ ప్రతినిధులు నిర్వహించారు. ఈసందర్భంగా హోమాలు నిర్వహించి, అత్యంత వైభవంగా సీతారామ లక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొనగా, గురువారం విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు.

70 కాదు.. 140 మీటర్లు

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఇపుడు అది 140 మీటర్లకు చేరుకోవడంతో వ్యయం రూ.5 వేల కోట్లను మించే అవకాశం ఉంది. అంటే మొత్తం ఓఆర్‌ఆర్ అంచనా వ్యయం రూ.20 వేల కోట్లు అవనున్నది.

ఓఆర్‌ఆర్‌తో పాటే ఐఆర్‌ఆర్ కూడా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఓఆర్‌ఆర్‌తో సంతృప్తి చెందకుండా ముందు ప్రతిపాదించిన విధంగా అంతర వలయ రహదారి(ఐఆర్‌ఆర్) నిర్మాణంపై కూడా దృష్టి పెట్టింది. ఓఆర్‌ఆర్ నిర్మాణ వ్యయం భరించనున్న నేపథ్యంలో ఐఆర్‌ఆర్‌ను పక్కన పెట్టాలని కేంద్రం దాదాపుగా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఆర్‌ఆర్ విషయమై ఇంకా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌ఆర్ నిర్మాణానికి ముందుకురాని పక్షంలో పీపీపీ విధానంలో అయినా నిర్మించి తీరాలన్న కృతనిశ్చయంతో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తుంది.

వాకింగ్ కు వెళ్ళే మహిళలు అప్రమత్తంగా ఉండాలి-సిఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వాకింగ్‌కు వెళ్లే మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అ ప్రమత్తంగా ఉండాలని సిఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డు, రేణింగవరం రోడ్డు తదితర ప్రాంతాలలో మహిళలు ఉదయం, సాయం త్రం సమయాలలో వాకింగ్ వెళ్ళేటప్పుడు విలువైన ఆభరణాలు ధరించకుండా వెళ్ళాలన్నారు. వాకింగ్ కు వెళ్ళే మహిళను టార్గెట్ గా బంగారం గొలుసులు దొంగతనం చేసే వ్యక్తులు మోటార్‌సైకిల్ పై వచ్చి మహిళల మెడలో ఉండే ఆభరణాలు లాక్కోని వెళ్ళే సంఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్న దృష్ట్యా అ ప్రమత్తం గా ఉండాలన్నారు. అదే సమయంలో అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే ఆ మోటార్ సైకిల్ ను సెల్ ఫోన్ లో ఫోటో తీయాలన్నారు. ఎక్కువ మంది మహిళలు ఉంటే ప్రతిఘటించి అదుపులోకి తీసుకోవాలన్నారు. మెడలో బంగారు ఆభరణాలు కనిపించకుండా జా గ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉపాధి పనులతో సమాజ అభివృద్ధి

- డ్వామా పీడీ విజయలక్ష్మి
- సంతమాగులూరులో 2023-24 పనులపై ప్రజా వేదిక
- 895 పనులకు రూ.2,22,72,641 ఖర్చు

సంతమాగులూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులతో సమాజంలోని సమగ్ర అభివృద్ధికి పునాదులు ఏర్పడుతున్నాయని బాపట్ల జిల్లా డ్రామా పీడీ కేవీ విజయలక్ష్మి పేర్కొన్నారు. సంతమాగులూరు మండలంలో 2023- 24లో జరిగిన పనులపై గ్రామాల్లో ప్రత్యేక బృందాలు సామాజిక తనిఖీ అనంతరం బుధవారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 20 గ్రామపంచాయతీలో మొత్తం ఎనిమిది వందల తొంభై ఐదు పనులు చేపట్టగా దానికి గాను రూ.12కోట్ల22లక్షల72,641 ఖర్చు చేసినట్లు తెలిపారు. పూర్తి చేసిన పనులు 36 పంచాయతీరాజ్ ద్వారా నిర్వహించగా ఒకటి గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. తొలగించిన క్షేత్ర సహాయకులు ప్రజావేదికకు రాకపోవడంతో ఉన్నతాధికారులకు బదులు ఇవ్వడంలో క్షేత్ర సహాయకులు కొంత మేర తడబడ్డారు. ప్రజావేదిక కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్, ఎంపీడీఓ జ్యోతిర్మయి, ఏ పి డి కోటనాయక్, ఏ పి ఓ నాయక్ పాల్గొన్నారు.

మిన్నెకల్లు సినిమా థియేటర్‌లో మోటారు చోరీ

సంతమాగులూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిన్నెకల్లు గ్రామంలోని అమ్మ సినిమా థియేటర్‌లో మంగళవారం రూ.40 వేల విలువైన మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసారని యజమాని సుబ్బారావు తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎంటీఎస్ టీచర్ల తాత్కాలిక తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు విధానంతో మినిమం టైమ్ స్కేలుతో పనిచేస్తున్న డీఎస్సీ 1998, 2008 టీచర్ల తొలగింపునకు రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ పి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. వీరిని నియమించిన కాంట్రాక్టు విధానంలోనే వీరితో 11 నెలలు పని చేయించుకొని మిగిలిన నెల నోవర్క్ నోపే కింద పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో పాఠశాలల అవసరాల దృష్ట్యా వీరిని 2024 జూన్‌లో నియమించారు. 11 నెలలు అంటే ఏప్రిల్ 30తో గడువు ముగుస్తుంది. 30న సాయంత్రం వీరందరిని ఉద్యోగాల నుంచి తొలగించాలని డీఈవోలను ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ ఆదేశించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం తదుపరి సూచించిన ప్రకారం ఉత్తర్వులు ఇస్తామని పేర్కొన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పాలిసెట్-25కు హాజరయ్యే విద్యార్థులకు ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమైంది. మేథమేటిక్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నారు.

గంటలో రిజిస్ట్రేషన్

- రోజంతా వేచి ఉండాల్సిన అవసరం లేదు
- డాక్యుమెంట్ల రిజిస్టర్‌కు స్లాట్ బుకింగ్
- ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రాలలో రేపటి నుంచి

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ శాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నారు. పాతకాలం నాటి విధానాలకు చెల్లుచీటి ఇస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు లేకుండా తమకు వెసులుబాటు ఉన్న సమయంలో వెళ్లి గంట వ్యవధిలో పనిచేసుకొని తిరిగి వచ్చే విధంగా స్లాట్ సిస్టంను అమలులోకి తీసుకురానున్నారు. తొలుత ఏప్రిల్ 1 నుంచి అని చెప్పినప్పటికి సాంకేతిక కారణాల వలన ఈనెల 4 నుంచి ఈ విధానం అమలులోకి రానుంది. ఇప్పటికే నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సబ్ రిజిస్ట్రార్లకు పాతకాలంలో ఉన్న స్టేజిలను తొలగించి, అధికారులు, ప్రజలకు ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా మార్పులు చేశారు. నేరుగా సబ్ రిజిస్ట్రార్ ఎదురుగా కూర్చుని దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలుగా మార్పులు చేసారు. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే వారు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేసి వారికి మంచినీళ్ల, టీ, కాఫీలు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. అదేక్రమంలో స్లాట్ బుకింగ్ విధానం వలన సమయం వృథాకాకుండా ఉంటుందని, ఈనెల 4 నుంచి కొత్త విధానం అమలులోకి తీసుకొస్తున్నారు. ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రంలోని ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌ను అమలు చేయనున్నారు.

78 స్లాట్లు అందుబాటులో..

ప్రస్తుతం ఒంగోలులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్న నేపథ్యంలో అవసరమైన వారు తమ దస్తావేజులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. వారికి అనువైన సమయంలో ఖాళీ గా ఉన్న స్లాట్‌ను ఓకే చేసుకొని ఆ సమయంలో కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ వారి దస్తావేజులను సబ్‌రిజిస్ట్రార్ పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారు. అందుకు సంబంధించి వేలిముద్రలను, సంతకాలను కార్యాలయ సిబ్బంది సేకరిస్తారు. దీంతో సమయం వృథాకాకుండా కేవలం గంటలోనే ప్రక్రియ పూర్తవుతుంది. ఒంగోలు కార్యాలయంలో 78 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. అక్కడ ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు ఉంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు స్లాట్లు అందుబాటులో ఉంటాయి.

బుకింగ్ ఇలా..

రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో తమ దస్తావేజును అప్‌లోడ్ చేయాలి. దీంతో అప్లికేషన్ నంబరు వస్తుంది. ఆ నంబరును నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. స్లాట్ టైమ్‌లో సంబంధిత క్రయ విక్రయదారులు కార్యాలయంలో అందుబాటులో ఉండాలి.

స్లాట్ బుకింగ్ విధానంపై అవగాహన కల్పించాం

స్లాట్ బుకింగ్ విధానంపై ఇప్పటికే ప్రజలకు, మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులకు అవగాహన కల్పించాం. ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజు 78 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఇంకా ఏరోజు నుంచి స్లాట్లు అందుబాటులో ఉంటాయనేది ఆదేశాలు రావాల్సి ఉంది. ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మాత్రమే ఈ విధానం అమలు చేయనున్నారు.

\- కె.శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్, ఒంగోలు ఆర్వో

చంద్రన్న పథకాలతో ప్రజల హర్షాతిరేకాలు

» సీఎం వరాలపై స్థానిక వర్గాల్లో ఆనందం

» హామీలపై కృతజ్ఞతలు

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం నిరుపేద ప్రజలకు వరాలు కురిపించింది. అందుకు సంబంధించి మంగళవారం చినగంజాం మండలం పెదగంజాంలోని కొత్తగొల్లపాలెంలో జరిగిన ప్రజా వేదిక సభలో సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు పలు పథకాలపై స్పష్టమైన హామీ ఇచ్చారు. తల్లికి వందనం, రైతు భరోసా, మత్స్యకార భరోసా, డీఎస్సీని సైతం విడుదల చేస్తామంటూ ప్రకటించి ప్రజల బాగోగులుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వైసీపీ హయాంలో అరకొర పథకాలు, చాలీచాలని నిధులతో కోతలు విధించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమానికి ప్రస్తుత ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. దీనిపై ప్రజలు వారి అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.



తోటవారిపాలెం సచివాలయంలో రైతు పథకాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మత్స్యకారులకు భరోసాతో సంతోషం



ఏటా ఏప్రిల్, మేలో అలల తాకిడికి గుడ్లు ఉత్పత్తి జరిగి మత్స్య సంపద పెరుగుతుంది. ఈక్రమంలోనే వేటను రెండు మాసాలు నిలిపి వేస్తాం. దీంతో ప్రభుత్వం మాకు భరోసా అందిస్తుంది. ఈక్రమంలోనే గత ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు ప్రకటించినప్పటికీ గతేడాది ఇవ్వలేదు. చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మత్స్యకార భృతిని రూ.20వేలుగా ప్రకటించడంతో పాటు జూన్‌లోపే భరోసా అందిస్తానని హామీని ఇవ్వడం ఆనందంగా ఉంది.

- అర్జిల్లి సత్తిబాబు, వాడరేవు మత్స్యకారుడు

గతంలో ఒక బిడ్డకే



నేను చేనేత కార్మికురాలిని. నిరుపేద కుటుంబం ఈక్రమంలో ఇద్దరి బిడ్డల చదువుకు గతంలో నానా యాతన పడ్డాను. ఈ సారి ఏకంగా ఇంట్లో ఉన్న ఇద్దరు బిడ్డలకు ప్రభుత్వం తల్లికి వందనం ప్రకటించింది. ఈసారి వేసవి ముగియగానే పథకం అమలు చేస్తుండడం ఆనందంగా ఉంది. థాంక్యూ సీఎం సార్.

- ఆకురాతి ఉమాదేవి, సావరపాలెం

ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు



నిరుపేద కుటుంబంలో జన్మించాను. తల్లి దండ్రులు అప్పులు చేసి చదివించారు. పీహెచ్‌డీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాను. టీడీపీ కూటమి ప్రభుత్వం జూన్‌లోపే డీఎస్సీ ని విడుదల చేస్తున్నట్లు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం ఆనందంగా ఉంది.

- అవ్వారు శ్రీనివాసరావు, నిరుద్యోగి, ఈపూరుపాలెం

రైతులు నష్టపోకుండా చర్యలు



గత ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.13,500 ప్రకటించింది. అయితే అమలులో తీవ్ర జాప్యం నెలకొంది. ఈక్రమంలో రైతులు నానా తిప్పలు పడాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం భరోసాను రూ..20 వేలకు పెంచడంతోపాటు వేగంగా అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం ఆనందంగా ఉంది.

- రావిపాటి హరిబాబు, తోటవారి పాలెం రైతు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం, ఐఈఆర్‌టీలు

ఆటిజం అంటువ్యాధి కాదు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆటిజం అనేది జబ్బు కాదు, అంటువ్యాధి అసలే కాదని, ఇది ఒక స్థితి మాత్రమని ఐఈఆర్‌టీ కొంగల శ్రీనివాస్ అన్నారు. బుధవారం అద్దంకి సత్రంబడి ఆవరణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటిజంకు ప్రత్యేకంగా మందులు ఏమీ లేవని, నివారణకు థెరపీటిక్స్ శిక్షణ, చిన్నారుల తల్లిదండ్రులకు అవసరమైన కౌన్సెలింగ్ మాత్రమే సమస్యకు పరిష్కారం అన్నారు. ఆటిజం చిన్నారులలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని, వీ రిని కోపగించుకోవడం, నేరుగా చూడడంగాని, ఎగతాళి చేయడం చేయరాదన్నారు. రెండేళ్ల వయస్సులో సమస్యను గుర్తించి చికిత్సకు తీసుకెళ్లాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందించాలని, పూర్తి సమాచారం కోసం దగ్గరలోని భవిత కేంద్రంలో సందర్శించి తగు సూచనలు పొందాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆట పాటలు నిర్వహించి సత్రం బడి పాఠశాల హెచ్ఎం రామారావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ యోనా, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన గీతామందిర్‌లో ఉదయం 9 గంట నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినుకొండకు చెందిన వెన్నెల నేత్రాలయం సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. బుధవారం కార్యాలయంలో కంటి వైద్య శిబిరం కరపత్రాన్ని సభ్యులు ఆవిష్కరించారు. కంటి వైద్యులు డాక్టర్ దస్తగిరి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు జరుగుతాయని అద్దంకి పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళి సుధాకరరావు, దేవపాలన, చంద్రమౌళి, మహమ్మద్ రఫీ, గృహాలక్ష్మి, శ్రీలక్ష్మి, శివకుమారి పాల్గొన్నారు.

నేడు, రేపు చీరాల వైద్యశాలలో అంధత్వ పెన్షన్ లబ్ధిదారులకు వైద్య పరీక్షలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల నందు గురు, శుక్రవారాలల్లో అంధత్వం కలిగిన దివ్యాంగ పెన్షన్ దారులలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఎంపీడీవో బత్తిన సింగయ్య బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. సంబంధిత లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు పంపించామని, ఆయా పెన్షన్‌దారులు తమకు కేటాయించిన తేదీల్లో వైద్య పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు. నోటీసులు రాని అంధ దివ్యాంగుల పెన్షన్ దారులకు, ఇతర కేటగిరీల దివ్యాంగులకు వైద్య పరీక్షల తేదీలను మరలా తెలియజేస్తామని చెప్పారు.

దాతల సహకారం అభినందనీయం

ఇంకొల్లు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల, విద్యార్థుల విద్యాభ్యున్నతికి దాతలు అందిస్తున్న సహాయం అభినందనీయమని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి అన్నారు. ఈ పాఠశాలలో ప్రతి ఏడాది 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి విద్యాభ్యున్నతికై అదే గ్రామానికి చెందిన పొన్నం అనంతలక్ష్మి తన భర్త వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం కెనరా బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీని వారికి నగదు బహుమతిగా అందించేలా ముందుకువచ్చారు. బుధవారం దాత అనంతలక్ష్మిని పేరిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అంబటి సుబ్బారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఐదుగురు అరెస్ట్

స్థలం వివాదంలో జరిగిన ఘటన

గవినిపాలెం(చీరాల), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై పలువురు తీవ్రంగా కత్తితో దాడిచేసి గాయపరచగా అతను ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈమేరకు నమోదైన కేసులోని నిందితులను ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చీదరబోయిన నాగేశ్వరరావుకు, చీదరబోయిన భరత్, వీరయ్య, లక్ష్మీనారాయణకు స్థలం వివాదాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గత ఆదివారం నాగేశ్వరరావు నాయనమ్మ రాములమ్మ తన స్థలంలో ఇంటి నిర్మాణం నిమిత్తం బేస్ మట్టం చేయించుకుంటుంది. దీనికి సంబంధించి హద్దు విషయంలో రాములమ్మతోపై ముగ్గురు వాదనకు దిగారు. దీంతో విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ నాగేశ్వరరావు వారిని నిలదీశాడు. పై ముగ్గురితో పాటు మరో ఇద్దరు కలిసి నాగేశ్వరరావును కత్తితో ఘోరంగా దాడి చేయగా శరీరంపై పలుచోట్ల రక్త గాయాలు అయినాయి. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈ కేసులోని ఐదుగురు నిందితులను బుధవారం రాత్రి పోలీసులు అరెస్ట్‌చేసి, గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

ఏపీవో రేణుకా బదిలీ

ఇంకొల్లు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండల జాతీయ ఉపాధి హామీ అధికారిగా గత ఐదు సంవత్సరాలుగా బాధ్యతలు చేపట్టిన ఏపీవో రేణుకా యద్దనపూడి మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు. ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న సురేష్ పర్చూరుకు బదిలీ అయినట్లు చెప్పారు.

సీఎం పర్యటన విజయవంతంపై ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు

పర్చూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీ, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ చూపి పర్చూరు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పీ-4 కార్యక్రమంలో భాగంగా అధినేత పిలుపుతో కదలి వచ్చిన బంగారు కుటుంబం మార్గదర్శకులకు, పర్యటనను ఎక్కడా కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేసిన జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు తెలిపారు.



సీఎం చంద్రబాబు పర్యటనలో ఎమ్మెల్యే ఏలూరి

నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో విద్యా రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య అన్నారు. బుధవారం సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరిగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరో అతిథిగా టెక్ మహీంద్ర కంపెనీ ప్రతినిధి వెంకట గోపీచంద్ హాజరయ్యారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విద్యార్థి దశ నుంచి ఆచరించాల్సిన లక్షణాలను, లక్ష్యాలను వివరించారు. ప్రజా వ్యవస్థకు విద్యార్థులు మూలమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రేపు ఎంపీడీవో కార్యాలయంలో క్రెడిట్ క్యాంప్

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఓబీ ఎంఎంఎస్ సైట్‌లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు క్రెడిట్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. బ్యాంకర్ల సమక్షంలో క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు వెనుకబడిన వర్గాలువారి కోసం బీసీలకు 16 యూనిట్లకు 31 లక్షలు, ఈడబ్ల్యూఎస్ వారికి 8 యూనిట్లకు రూ.14లక్షలు మంజూరయ్యాయన్నారు.

నేడు రీ-సర్వేపై ర్యాలీ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం పోలూరు, యనమదల గ్రామాలలో గురువారం రీసర్వేపై అవగాహనా ర్యాలీలను ప్రారంభిస్తున్నామని, రైతులు తప్పని సరిగా పాల్గొనాలని తహసీల్దారు కె.రవికుమార్ కోరారు.

రెస్టారెంట్‌ల వ్యర్థాలు కాలువలో వేస్తే చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రెస్టారెంట్‌ల నుంచి వ్యర్థాలను జల్లెడలు ఏర్పాటు చేసుకోకుండా నేరుగా సైడ్ డ్రైన్‌లలోకి వదిలితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. నామ్ రోడ్డు వెంబడి పోతురాజుగుండి, భవానీసెంటర్ మధ్యలో ఉన్న రెస్టారెంట్‌ల నుంచి వచ్చే మురుగు నీరు కాకానిపాలెంలో నిలిచి దుర్వాసన వెదజల్లుతున్న నేపథ్యంలో స్థానికులు మంగళవారం రాత్రి మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. రవికుమార్ ఆదేశాలతో కమిషనర్ రవీంద్ర బుధవారం పరిశీలించి రెస్టారెంట్‌ల నిర్వాహకులతో మాట్లాడారు. ఎన్టీఆర్‌నగర్‌లో మంచినీటి సమస్యను కూడా పరిశీలించారు. వేసవి ఎద్దడి నుంచి గట్టెక్కేందుకు మూడు సింథటిక్ ట్యాంక్‌లు, రెండు పబ్లిక్ ట్యాప్ లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



కాకానిపాలెంలో కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

మందుబాబులకు అడ్డాగా మండల పరిషత్ కార్యాలయం

» రాత్రుళ్లు ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లి మందు పార్టీలు

» ఉదయానికి ఖాళీ గ్లాసులు, బాటిళ్లు దర్శనం

» ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజల విజ్ఞప్తి

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మందుబాబుల ఆగడాలకు హద్దే లేకుండా పోతుంది. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోకి కొందరు రాత్రుళ్లు వెళ్లి పూటుగా మద్యం సేవించి పార్టీలు చేసుకుంటున్నారు. తాగిన గ్లాసులు, సీసాలు అక్కడే పడవేసి పోతున్నారు. అధికారులు మందు బాబులు రాకుండా కార్యాలయ గేట్లకు తాళాలు వేయిస్తున్నా ప్రహరీ గోడను దూకి లోపలికి వెళ్లి ఎంచక్కా తాగుతున్నారు. బల్లికురవ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం మందు బాబులకు అడ్డాగా మారింది. రాత్రి పూట కొందరు మద్యం తాగి, రకరాల ఆహార పదార్థాలను తిని వదిలేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం పడమర భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో విచ్చల విడిగా మద్యం సీసాలు, గ్లాసులు పడి ఉంటున్నాయి. ఉదయం ఉద్యోగులు విధులకు వచ్చే సరికి కార్యాలయం ముందు ఉన్న విశ్రాంతి బల్లల మీద మద్యం బాటిళ్లు ఉండి అంతా అపరిశుభ్రంగా మారుతుంది. వీటిని చూసిన వారు కార్యాలయం ప్రహరి గేటుకు కూడా తాళాలు వేయిస్తున్నారు. అయినా గేట్లను, గోడను దూకి లోపలికి వచ్చి పార్టీలు చేసుకుంటున్నారు. రాత్రి సమయంలోకార్యాలయంలో వాచమన్‌ను నియమించి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



కార్యాలయ ప్రాంగణంలో తాగి పడేసి ఉన్న ఖాళీ గ్లాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

ఉపాధి పనులు చేపట్టాలి

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కూలీలకు ఇబ్బందులు లేకుండా అన్ని గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో పనులు లేవంటు కూలీలు చెప్తున్నారని వెంటనే పనులు గుర్తించి అప్పగించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీఎం రమాదేవి పాల్గొన్నారు.

పశువుల కోసం 25 నీటి తొట్లు మంజూరు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పశువులకు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా ఉపాధి హామీ పథకం ద్వారా 25 నీటి తొట్లు మంజూరైనట్లు ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. ఒక్కో నీటి తొట్టికి రూ.40వేలు ఉపాధి నిధులు అందజేస్తామని తెలిపారు. బల్లికురవ, గొర్రెపాడు, కొమ్మినేనివారిపాలెం, కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు, ఎస్ఎల్ గుడిపాడు, వల్లాపల్లి, వేమవరం గ్రామాలకు ఒక్కొక్కటి, గుంటుపల్లికి 2, కొప్పెరపాడుకు 3, ముక్తేశ్వరానికి 5, మల్లాయపాలెంకు 2, వైదనకు 2 చొప్పున నీటి తొట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు చేపడతామని ఎంపీడీవో తెలిపారు.

పొదుపు మహిళల జీవనోపాధి పెంపునకు ప్రణాళిక



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం రాజారావు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలలోని సభ్యుల జీవనోపాధి పెంపుదలకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలని వెలుగు ఏపీఎం రాజారావు కోరారు. బుధవారం వెలుగు కార్యాలయంలో 2025-2026 సంవత్సరాలకు గాను వార్షిక ప్రణాళికపై గ్రామాల ఎన్యూమరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రానున్న ఏడాదిలో పొదుపు సంఘాలలో ఉన్న మహిళకు కావాల్సిన వసతులపై సర్వే చేపట్టాలని, అన్ని గ్రూపుల వివరాలను సేకరించాలన్నారు. గతంలో రుణాలు పొంది ఉన్నారా, సకాలంలో చెల్లింపులు చేశారా, భవిష్యత్ అవసరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, సీసీ పేరయ్య, పార్మా మిత్ర అంజయ్య పాల్గొన్నారు.

చిన్న సైజు గుడ్లను కేంద్రాల వారు తీసుకోవద్దు

బల్లికురవ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అంగన్ వాడీ కేంద్రాలకు చిన్న సైజులో ఉన్న కోడి గుడ్లను ఇస్తే ఎవరు తీసుకోవద్దని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ సూచించారు. బుధవారం బల్లికురవ, కొప్పెరపాడు గ్రామాలలో అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశాలు జరిగాయి. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో కోడి గుడ్లు మురిగి పోయినవి వస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, జాగ్రత్తగా పరిశీలించి గుడ్లను తీసుకోవాలని తెలిపారు. 600 గ్రాముల బరువు ఉన్న గుడ్లను మాత్రమే కేంద్రాలకు తీసుకోవాలన్నారు. బాలసంజీవని యాప్‌పై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మలా పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మేదరమెట్లలోని తపాలా కార్యాయలం ఉద్యోగి గంగిశెట్టి భ్రమరాంబిక తన అమ్మమ్మ మద్దా కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. దాతను క్లబ్ సభ్యులు, ఆశ్రమం నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మురళీసుధాకరరావు, డాక్టర్ దేవపాలన, శివకుమారి, లేవిప్రసాద్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలల్లో రెండు దశలలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన శింగయ్య తెలిపారు. 3వ తేదీన వెంకటాపురం, శింగరకొండపాలెం, కుంకుపాడు, 4వ తేదిన విప్పర్లవారిపాలెం, నాగులపాడు, కోటికలపూడి, 5వ తేది పేరాయపాలెం, గోపాలపురం, వేలమూడిపాడు గ్రామాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయన్నారు. 8న ఉప్పలపాడు, ధర్మవరం, మణికేశ్వరం, 9న వెంపరాల, శంఖవరప్పాడు, కొంగపాడు, 10న బొ మ్మనంపాడు కలవకూరు, రామాయపాలెం, 11న జార్లపాలెం, చక్రాయపాలెం, తిమ్మయపాలెం గ్రామాలల్లో జరుగుతాయని, కొత్త ఆధార్, వేలిముద్రలు అప్‌డేట్, ఫోన్ నెంబర్ లింక్ వంటి సేవలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆయన తెలిపారు.

చినగంజాం : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి రెండు విడతలగా ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా 3, 4 తేదీల్లో, రెండవ విడతగా 8, 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లోని 0 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తల సహకారంతో ఆధార్ మొబైల్ క్యాంపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ నెల 3వ తేది సంతరావూరు, కడవకుదురు, 4వ తేది మోటుపల్లి, 8వ తేది గొనసపూడి, పల్లెపాలెం, 9వ తేదీన చినగంజాం, కొత్తపాలెం, 10వ తేదీ మున్నంవారిపాలెం, పెదగంజాం, 11వ తేది రాజుబంగారుపాలెం, పెదగంజాం గ్రామాల్లో మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు జరుగునప్పుడు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆధార్ డిజిటల్ అసిస్టెంట్‌లకు ఇద్దరు సచివాలయ సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. క్యాంపులు జరుగు ముందు రోజు గ్రామాల్లో టామ్ టామ్, ఇతర ప్రసార సాధనాల ద్వారా ఆధార్ నమోదు గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో తెలిపారు.

మహిళల మెడలో బంగారు గొలుసు చోరీ

మేదరమెట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనపాలెం, మేదరమెట్లలో ద్విచక్రవాహనంపై వచ్చిన యువకులు మహిళల మెడలో బంగారు గొలుసులు తెంపుకెళ్లారు. మంగళవారం రాత్రి తిమ్మనపాలెంలో కుక్కకు అన్నపెడుతున్న వృద్ధురాలు సీతమ్మ మెడలో బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన యువకులు తెంపుకెళ్లారు. మరి కొంత సేపటి తర్వాత మేదరమెట్లలో ఒంటరిగి నడిచివెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకెళ్లారు. సీసీ కెమెరాలు పనిచేయక పోవడంవల్ల దుండగులను గుర్తించలేకపోయారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫి ఘటనా స్థలాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మేదరమెట్ల సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంవలన దుండగులను గుర్తించలేకపోయారు. పలు గ్రామాలకు ప్రధాన కూడలి అయిన మేదరమెట్లలో సీసీ కెమెరాలు లేకపోవడంవల్ల భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు వచ్చే అవకాశముంది. దాతల సహకారంతో సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.